మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 30-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 211 Issue: 211

30 జనవరి 2026 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:52 సూర్యాస్తమయం - సా. 6:06 తిథి ద్వాదశి ఉ. 11:09 వరకు తరువాత త్రయోదశి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం ఆరుద్ర తె. 3:260 వరకు తరువాత పునర్వసు యోగం వైధృతి సా. 4:50 వరకు కరణం బాలవ ఉ. 11:09 వరకు కౌలవ రా. 9:47 వరకు వర్జ్యం మ. 1:10 నుండి మ. 2:38 వరకు దుర్ముహూర్తం ఉ. 9:07 నుండి ఉ. 9:52 వరకు మ. 12:51 నుండి మ. 1:36 వరకు రాహుకాలం ఉ. 11:05 నుండి మ. 12:29 వరకు యమగండం మ. 3:18 నుండి సా. 4:42 వరకు గుళికాకాలం ఉ. 8:16 నుండి ఉ. 9:40 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:16 నుండి ఉ. 6:04 వరకు అమృత ఘడియలు సా. 6:18 నుండి రా. 7:46 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:51 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Published from Jagitial www.evarthalu.com



# సిట్ పిలుపు

## ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్‌కు నోటీసులు



**నేటి మధ్యాహ్నం విచారణకు రావాలని వినతి**

**ఇప్పటికిప్పుడు వీలు కాదన్న బీఆర్ఎస్ అధినేత**

**మున్సిపల్ ఎన్నికల్లో బిజీగా ఉన్నానని ప్రత్యుత్తరం**

**ఎర్రవల్లి ఫాంహౌజ్‌కే నోటీసులు పంపాలని సూచన**

ఫోన్ ట్యాపింగ్ కేసు మరో మలుపు తిరిగింది. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావుకు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌రావుకు సిట్ నోటీసులు ఇచ్చి విచారణ జరిపింది. ఇప్పుడు ఏకంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కూడా ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇచ్చింది. కేసీఆర్ ప్రస్తుతం ఫామ్‌హౌజ్‌లో ఉండటంతో గురువారం ఉదయం సిట్ అధికారులు ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌కు వెళ్లి నోటీసులు ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే వారు ఫాంహౌజ్‌కు బదులుగా బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లి నోటీసులు ఇచ్చారు. ఆయన కుటుంబసభ్యులకు నోటీసులు అందజేశారు.

హైదరాబాద్, జనవరి 29 (ఈవార్తలు): సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద నోటీసులు ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులలో కోరారు. విచారణకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వయసురీత్యా విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని, తాము కోరిన చోటే విచారిస్తామని కేసీఆర్‌కు తెలిపారు.

### రేపు హాజరవ్వలేను: కేసీఆర్

సిట్ నోటీసులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. సిట్ అధికారులు నోటీసులో పేర్కొన్న రోజున తాను విచారణకు హాజరు కాలేనని ఆయన తెలిపారు. నందినగర్‌లోని తన

తరువాయి 2 వ పేజీలో...

## టార్గెట్ కేసీఆర్

**మున్సిపల్ ఎన్నికల వేళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అస్త్రాలు రిలీజ్**

**ఇటు ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలన్న సిట్**


**అటు కాళేశ్వరంలోని మేడిగడ్డ ప్రమాదంలో ఉందన్న కేంద్రం**

**సరిగ్గా మున్సిపల్ ఎన్నికల ముందే బయటికి వచ్చిన కేసులు**

**కేసీఆర్‌పై ముప్పేట దాడి చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ ఎత్తులు**

(ఈవార్తలు - పొలిటికల్ డెస్క్)

అసలే పంచాయతీ ఎన్నికల్లో ఘోర పరాజయం..
పైగా, రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత..
కాంగ్రెస్ పాలనపై సొంత పార్టీలోనే అసమ్మతి..
ఈ టైంలో మున్సిపల్ ఎన్నికలు జరిగితే..?
కాంగ్రెస్‌కు పరాభవం తప్పదన్నది విశ్లేషకుల మాట
సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి మరీ దారుణం..
అంతకుముందు నం.2గా ఉన్న ఆ పార్టీ స్థితి ఘోరం..
ప్రజా వ్యతిరేకతను ఒడిసి పట్టే పరిస్థితీ లేదు..
గెలిచేది ఎవరు? అంటే.. వినిపిస్తున్నది కారు పేరే
ఇప్పటికిప్పుడు బీఆర్ఎస్‌ను దెబ్బ కొంటాలంటే..?
అందుకే సిట్ నోటీసులు.. మేడిగడ్డ రిపోర్ట్..??



# మేడిగడ్డతో.. ముప్పు

## బరాజ్‌పై కేంద్రం రెడ్ అలర్ట్

## కేటగిరి-1 ప్రమాదకరంగా గుర్తింపు

**లోపాలు సరిదిద్దకపోతే ప్రమాదమని హెచ్చరిక**

తెలంగాణలోని మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్ భద్రతపై కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ వేదికగా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. దీనిని అత్యంత ప్రమాదకరమైన 'కేటగిరి-1' డ్యామ్‌గా ప్రకటించింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిర్వహించిన 2025 వర్షాకాలం అనంతర తనిఖీల్లో ఈ ప్రాజెక్టులో అత్యంత తీవ్రమైన లోపాలు ఉన్నట్లు తేలిందని, వీటిని తక్షణమే సరిదిద్దకపోతే బరాజ్ విఫలమయ్యే ప్రమాదం ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 29 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా గుర్తించిన మూడు అత్యంత సమస్యాత్మక ప్రాజెక్టులలో మేడిగడ్డ ఒకటి అని తెలిపింది. మేడిగడ్డ బరాజ్ పటిష్టతను కాపాడేందుకు ఎన్డీఎస్ఏ సిఫార్సు చేసిన వివిధ నివారణ, ఉపశమన చర్యలను తక్షణమే అమలు చేయాలని కేంద్ర జలశక్తి శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అటు.. ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరీ డ్యామ్, జార్ఖండ్‌లోని బొకారో బరాజ్ వంటి ఇతర కేటగిరి-1 ప్రాజెక్టులను కేంద్రం తన డీఆర్‌పీ-2 పథకం ద్వారా పునరావాస పనుల్లో చేర్చగా, మేడిగడ్డ విషయంలో తక్షణ రక్షణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యతను రాష్ట్రానికి సూచించింది. ప్రాజెక్టు

తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.17,885 |
| వెండి (గ్రాము): | రూ.425 |
| ప్లాటినం (గ్రాము): | రూ.8,050 |

# కొలువుదీరిన సమ్మక్క

**కుంకుమభరిణెగా జనంలోకి.. మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతం**

## గాల్లోకి ఎస్పీ కాల్పులు.. గూస్‌బంప్స్

మేడారం సమ్మక్క-సారలమ్మల మహా జాతర వైభవంగా సాగుతోంది. గురువారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. సమ్మక్క తల్లి వనం వీడి జనంలోకి వచ్చింది. చిలకలగుట్ట నుంచి సమ్మక్కను కుంకుమ భరిణె రూపంలో ప్రధాన పూజారి గుట్ట కిందకు తీసుకొచ్చారు. అక్కడ సమ్మక్క తల్లికి మంత్రులు సీతక్క అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఆనవాయితీ ప్రకారం.. సమ్మక్క తల్లికి గౌరవ సూచకంగా ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఏకే 47తో గాల్లోకి మూడు రౌండ్‌ల కాల్పులు జరిపారు.

(మేడారం - ఈవార్తలు ప్రత్యేక ప్రతినిధి)

సమ్మక్క తల్లి వనం వీడి జనంలోకి వచ్చే సమయంలో మేడారం చిలకలగుట్ట పరిసరాలలోని భక్తులు తన్మయత్వంతో పులకరించారు. డప్పు వాయిద్యాలతో మోత మోగించారు. జై సమ్మక్క, జై సమ్మక్క అంటూ నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. అక్కడి నుంచి భారీ బందోబస్తు నడుమ సమ్మక్క తల్లిని మేడారం గద్దెలకు చేర్చారు. అప్పటికే సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజులు

- 2 వ పేజీలో...



## విశ్వవాణి



### భూమికీ గుండె!

భూమికీ గుండె ఉందా? అంటే అవునంటున్నారు భూగర్భ శాస్త్రవేత్తలు. ప్రతి 26 సెకన్లకు ఒకసారి సెస్మిక్ పల్స్‌ను విడుదల చేస్తుందని చెప్తున్నారు. తొలిసారి 1960ల్లో దీన్ని గుర్తించగా, భూమి గుండె చప్పుడుగా వర్ణిస్తున్నారు.

# జీడీపీ 7.2 శాతం!

## వచ్చే ఏడాది అంచనాలకు మించి వృద్ధి


**ఈ ఏడాదిలో 7.4 శాతం నమోదయ్యే చాన్స్**

**ఆర్థిక సర్వే ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్**



న్యూఢిల్లీ: ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ఆర్థిక సర్వే 2025-26ను ప్రవేశపెట్టారు. ఇది భారత ఆర్థిక వ్యవస్థ గత ఏడాది పనితీరును సమీక్షించి, వచ్చే ఏడాది అంచనాల గురించి చెప్పే ముఖ్యమైన రిపోర్టు. బడ్జెట్ కు ముందు దీన్ని ప్రవేశపెడతారు. ఫిబ్రవరి 1న బడ్జెట్ రానున్న నేపథ్యంలో ఆర్థిక సర్వే గురువారం పార్లమెంటు ముందుకు వచ్చింది. ఈ సర్వేలో పలు అంశాలను ప్రస్తావించారు. సర్వే ప్రకారం.. 2026-27 ఆర్థిక సంవత్సరంలో +ఙూ వృద్ధి 6.8% నుంచి

# డిజిటల్ సిండ్రోమ్



**డేంజర్‌లో పిల్లలు, యువత**

**పెను ఆరోగ్య సమస్యగా మారింది**

**ఆర్థిక సర్వేలో కేంద్రం ఆందోళన**

దేశంలో పిల్లలు, యువతలో డిజిటల్ వ్యసనం ఒక ముఖ్యమైన ఆరోగ్య సమస్యగా మారుతోందని, ఇది మానసిక సంక్షోభానికి కూడా దారితీస్తోందని కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26లో ఈ కీలక విషయాలను వెల్లడించారు.

న్యూఢిల్లీ: డిజిటల్ పరికరాలకు మితిమీరి అలవాటు పడటం వల్ల యువతలో చదువుపై ఏకాగ్రత తగ్గడం, పని సామర్థ్యం దెబ్బతినడం, నిద్రలేమి (స్లీప్ డెట్) వంటి సమస్యలు పెరుగుతున్నాయని సర్వే పేర్కొంది. ముఖ్యంగా 15-24 ఏళ్ల వయసు వారిలో సోషల్ మీడియా వ్యసనం ఎక్కువగా ఉందని, ఇది ఆందోళన, డిప్రెషన్, ఆత్మన్యూనతకు కారణమవుతోందని తెలిపింది. ఆన్‌లైన్ గేమింగ్, సోషల్ మీడియాలో ఇతరులతో తమను పోల్చి చూసుకోవడం, నిర్విరామంగా స్క్రోలింగ్ చేయడం వంటివి వారి మానసిక ఆరోగ్యంపై తీవ్ర

తరువాయి 2 వ పేజీలో...




## డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ఆర్సీబీ

**చితక్కొట్టిన హ్యారిస్, మంధాన**

**యూపీ వారియర్స్‌పై పంజా**

**మరో టైటిల్‌కు అడుగు దూరంలో**

(..పూర్తి వివరాలు క్రీడావాణి పేజీలో..)

# రాశి ఫలాలు

30.1.2026

మేషం: వృత్తి వ్యాపారాలలో కొద్దిపాటి చికాకులు ఉంటాయి. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. ఆశించిన రీతిలో రాబడి ఉండదు. బంధు మిత్రులతో ఆకస్మిక వివాదాలు కలుగుతాయి. ఆర్థికంగా ఇబ్బందులు తప్పవు. ఉద్యోగ వాతావరణం కొంత గందరగోళంగా ఉంటాయి.

వృషభం: సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. వ్యాపారాలు విస్తరించి నూతన లాభాలు అందుకుంటారు. ఇంటా బయట నూతన విషయాలు తెలుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. నిరుద్యోగులకు ఉద్యోగ విషయంలో శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

మిధునం: చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తిచేస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో విందువినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. ఉద్యోగార్థులకు ఆశించిన ఫలితాలు పొందుతారు.

కర్కాటకం: ఆకస్మిక ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలలో ఒడిదుడుకులు ఉంటాయి. ఉద్యోగమున అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి.

సింహం: దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. జీవిత భాగస్వామితో ఆలయాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులలో అవాంతరాలు కలుగుతాయి. నూతన రుణ యత్నాలు చేస్తారు. ఉద్యోగస్తులకు పనిభారం పెరుగుతుంది. ధన ఇబ్బందులుంటాయి.

కన్య: పాత మిత్రులను కలుసుకుని కీలక విషయాలు చర్చిస్తారు. బంధుమిత్రులతో గృహమున విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. చేపట్టిన పనుల్లో పరిస్థితి కలుగుతుంది. వ్యాపార ఉద్యోగ అంత సంతృప్తికరంగా సాగుతాయి. ఆదాయం మరింతగా పెరుగుతుంది.

తుల: ముఖ్యమైన పనులలో ఆప్తుల సలహాలు తీసుకోవడం మంచిది. భూ కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాదిస్తారు. వృత్తి వ్యాపారములు పరిస్థితి మరింత అనుకూలంగా సాగుతాయి. ఉద్యోగమున పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందుతారు.

వృశ్చికం: ఇంటా బయట సమస్యలు మరింత పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన కార్యక్రమాలలో అవరోధాలు కలుగుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది.

ధనస్సు: ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. బంధువులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ముఖ్యమైన పనులలో స్థిరత్వం లేని ఆలోచనలు చేయడం వలన మానసిక అశాంతి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలు తప్పవు. విద్యార్థులకు నిరుద్యోగులకు అధిక కష్టం మీద స్వల్ప ఫలితం పొందుతారు.

మకరం: గృహమున శుభకార్య వాతావరణం ఉంటుంది. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగుపడుతుంది. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. భూ సంబంధిత వివాదాలు కలుగుతాయి. భూ సంబంధిత క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుకుంటారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు.

కుంభం: చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. బంధు మిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం కలుగుతుంది. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. దైవ చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో చికాకులు తప్పవు.

మీనం: సమాజంలో పేరు కలిగిన వారితో పరిచయాలు భవిష్యత్తు ఉపయోగపడతాయి. సోదరులతో వివాదాలు పరిష్కారం దిశగా సాగుతాయి. గృహంలో శుభకార్యాలు పరమైన ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో విజయం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఒత్తిడిని అధిగమించి లాభాల అందుకుంటారు.





# టార్గెట్ కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో తల నొప్పేం లేదు. రాష్ట్రంలో ఉన్న బీజేపీ నాయకులతో బాధేం లేదు. బీజేపీ తమకు ప్రత్యర్థే కాదని అధికార కాంగ్రెస్ ఫిక్సయిపోయింది కూడా. బీజేపీ కూడా కాంగ్రెస్ సర్కారును ప్రతిపక్షంగా చూస్తున్నట్లు లేదు. కాంగ్రెస్ విమర్శలైనా.. బీజేపీ విమర్శలైనా.. ఎక్కుపెట్టేది బీఆర్ఎస్‌పైనే. అవును! ఈ రెండు పార్టీలకు బీఆర్ఎస్ కొరకరాని కొయ్యగా మారింది. ఎక్కడైనా అధికారంలో ఉన్న పార్టీని ప్రతిపక్ష పార్టీలు టార్గెట్ చేస్తుంటాయి. కానీ, తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ తీరు వేరుగా ఉంది. ఈ రెండు పార్టీల ప్రధాన టార్గెట్ బీఆర్ఎస్ మాత్రమే. బీజేపీ నేతలు ఏ నాడూ కాంగ్రెస్ పాలనపై, ఆ సర్కారు నిర్ణయాలను తప్పుపడుతూ పోరాడింది లేదు. యూరియా కొరతపై నిలదీసింది లేదు. నీళ్ల సాగుపై మాట్లాడింది లేదు. ఏదో తూతూమంత్రంగా విమర్శలు చేసి చేతులు దులుపుకున్నారు కమలం పార్టీ నేతలు. సేమ్ టు సేమ్.. కేంద్రంలోని బీజేపీని అలా.. తిట్టిందే తప్ప, మోదీ సర్కారు విధానాలపై ఢీకొట్టి మాట్లాడిన తెలంగాణ కాంగ్రెస్ నాయకుడే లేరు. సీఎం రేవంత్ రెడ్డి నేరుగా.. ప్రధాని మోదీని బడే భాయ్ అని పిలిచారు. ఇదంతా చూస్తుంటే ఒక అండర్ స్టాండింగ్‌లా కనిపిస్తోంది. కానీ, బీఆర్ఎస్ పరిస్థితి అలా కాదు. సోషల్ మీడియా మొదలుకొని అగ్ర నాయకత్వం వరకు ప్రతి ఒక్కరు కాంగ్రెస్, బీజేపీ విధానాలను చెడుగుడు ఆడుతున్నారు. కేసీఆర్ మినహా ఆ పార్టీ హై అలర్ట్‌గా ఉంది. ఎప్పటికప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ, తప్పులను ఎత్తి చూపుతూ నిద్రలేకుండా చేస్తోంది. రాష్ట్రంలో మళ్లీ రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనన్న భరోసాను కేటీఆర్, హరీశ్ రావు కల్పిస్తున్నారు. ప్రజల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి ఎక్కువవుతున్నదన్నది వాస్తవం. ఇది కారు గుర్తుకు ప్లస్ అవుతోంది. ఆ ఫలితమే పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి దీటుగా గులాబీ పార్టీ సీట్లను గెలుచుకోవడం. అయితే, ఆ ఎన్నికలు పార్టీ గుర్తుతో జరగకపోవడంతో కాంగ్రెస్‌కు భారీ డ్యామేజీ ఏం జరగలేదు. కానీ, మున్సిపల్ ఎన్నికలకు నగారా మోగింది. ఈ ఎన్నికలు జరిగేవి పార్టీ గుర్తులపైనే. అంటే.. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు రిజల్ట్ తేడా కొడితే, మొదటికే మోసం వస్తుంది. అయితే, ఈ నేపథ్యంలోనే కేసీఆర్ అండ్ కోను వేరే పనుల్లో బిజీ చేసేందుకు కాంగ్రెస్ ఫోన్ ట్యాపింగ్ అంశంలో సిట్‌ను రంగంలోకి దించిందని రాజకీయ విశ్లేషకులు ఘంటాపథంగా చెప్తున్నారు. అనుకున్నట్లుగానే హరీశ్, కేటీఆర్, సంతోష్‌ను సిట్ ముందు కూర్చోబెట్టింది. అలాగే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కూడా అలాగే ఎంగేజ్ చేయాలని చూసింది. కానీ, కేసీఆర్ తన మార్కు దూకుడుతో సిట్‌కే చెమటలు పట్టించారు. చట్టంలోని అంశాలను ప్రస్తావిస్తూ తన వద్దకే సిట్ అధికారులు రావాలని స్పష్టం చేశారు. పైగా, ఇప్పుడు తాను మున్సిపల్ ఎన్నికల్లో బిజీగా ఉన్నానని, తర్వాత విచారణ చేసుకోండని తేల్చిచెప్పారు. ఇదే సమయంలో కేంద్రం కూడా తన అస్త్రాన్ని బీఆర్ఎస్‌పై ప్రయోగించింది. బీఆర్ఎస్‌కు ఇబ్బందిగా మారిన కాళేశ్వరం-మేడిగడ్డ అంశాన్ని తెరపైకి తెచ్చింది. మేడిగడ్డ అత్యంత ప్రమాదంలో ఉందని రాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఇన్ని రోజులు చడీ చప్పుడు చేయని కేంద్రం.. ఉన్నట్టుండి మున్సిపల్ ఎన్నికల ముందే మేడిగడ్డ అస్త్రాన్ని ప్రయోగించడం.. కచ్చితంగా బీఆర్ఎస్‌ను మున్సిపల్ ఎన్నికల్లో దెబ్బకొట్టేందుకేనన్నది విశ్లేషకుల మాట.

# సిట్ పిలుపు

మొదటి పేజీ తరువాయి

నివాసంలో అధికారులు నోటీసులు ఇవ్వడంపై గులాబీ అధినేత ప్రత్యుత్తరం రాశారు. శుక్రవారం విచారణ కుదరని ఆయన పోలీసులకు వివరించారు. అంతేకాదు తనను ఎర్రవల్లిలోనే మరోరోజు విచారణ చేయాలని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. సిట్ అధికారులు గురువారం తనుకు నోటీసులు జారీ చేయడంపై కేసీఆర్ సానుకూలంగా స్పందించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు నందినగర్‌లోని నివాసంలో అందుబాటులో ఉండాలని వారు కోరారు. అయితే.. మున్సిపల్ ఎన్నికల నామినేషన్లకు శుక్రవారమే ఆఖరు తేదీ కావడంతో.. అభ్యర్థులను ఖరారు చేయడంతో తాను బిజీగా ఉన్నానని విచారణను మరోరోజు జరపాల్సిందిగా కేసీఆర్ పోలీసులకు తెలిపారు. జూబ్లిహిల్స్ ఏసీపీ పి.వెంకటగిరికి శుక్రవారం తాను హాజరు కాలేకపోవడానికి గల కారణాలను వివరిస్తూ రెండు పేజీల లేఖ రాశారు గులాబీ బాస్. సెక్షన్ 160 సీఆర్పీసీ ప్రకారం మరో రోజున తనను ఎర్రవల్లిలోని నివాసంలో విచారించాలి. అంతేకాదు ఈ సెక్షన్‌లోని నిబంధనల మేరకు నాకు మీరు ముందస్తు నోటీసులు పంపించి ఆ తర్వాతే విచారించాలి. మరో విషయం 65 ఏళ్లు పైబడిన పురుషులను వారు విచారణ కోసం పోలీస్ స్టేషన్ వెళ్లనవసరం లేదు. పోలీసులే వారి ఇంటివద్దకు వెళ్లి విచారణ చేపట్టాలి. ఇకపై నాకు పంపాల్సిన నోటీసులను నేను నివసిస్తున్న ప్రాంతానికి అంటే.. ఎర్రవల్లికే పంపాలి. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా, బాధ్యతగల పౌరుడిగా సిట్ విచారణకు పూర్తిగా సహకరిస్తాను అని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు.

## న్యాయ సలహా తీసుకుంటాం: సిట్


హైదరాబాద్, జనవరి 29 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల సమయంలో నామినేషన్లకు చివరి రోజున తనను సిట్ విచారణకు పిలవడాన్ని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ అధినేత సంధించిన ప్రశ్నలకు సిట్ అధికారులు వెనక్కి తగ్గారు. సీర్పీసీ ప్రొసీజర్స్‌లోని పలు అంశాలను లేవనెత్తుతూ గులాబీ అధినేత రాసిన లేఖతో సిట్ అధికారులు నీళ్లు నమిలారు. న్యాయ సలహాలు తీసుకున్న తర్వాత మరోసారి నోటీసులు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు సిట్ అధికారులు తెలిపారు. శుక్రవారం విచారణకు హాజరు కాలేను అంటూ కేసీఆర్ రాసిన లేఖపై సిట్ అధికారులు స్పందిస్తూ.. కేసీఆర్‌కు సమయం ఇవ్వాలని భావిస్తున్నామని, న్యాయ సలహా తీసుకున్నాకే మరొకసారి నోటీసులు ఇస్తామని వెల్లడించారు. విచారణ తేదీ, ఎక్కడ విచారణ జరపాలి? అనే అంశాలపై న్యాయ నిపుణులను సంప్రదించాకే ముందుకెళ్తామని అన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కేసీఆర్ సిట్ విచారణ వాయిదాపడింది.

# కొలువుదీరిన సమ్మక్క

మొదటి పేజీ తరువాయి

మేడారంలో గద్దెలపై కొలువుతీరిన సంగతి తెలిసిందే. ఇక, మేడారం జాతర జరుగుతన్న ప్రాంతం లక్షలాది మంది భక్తులతో జనసంద్రంగా మారింది. మేడారం తరలివచ్చే భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి, అక్కడి నుంచి గద్దెల వద్దకు చేరుకుని వనదేవతలను దర్శించుకుంటున్నారు. సమ్మక్క తల్లి గద్దెలకు చేరిన తర్వాత వనదేవతలను దర్శించుకునే సంఖ్య మరింతగా పెరుగుతంది. శుక్రవారం వనదేవతలు భక్తులకు దర్శనమివ్వనున్నారు. శనివారం రోజున దేవతల వనప్రవేశంతో జాతర ముగియనుంది.

గత రెండు రోజులుగా మేడారంలో విపరీతమైన రద్దీ నెలకొంది. అటు జంపన్న వాగు పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మరోవైపు మేడారం గద్దెల వద్ద క్యూ లైన్లు కూడా భక్తులతో నిండిపోయాయి. అటు ఆర్టీసీ బస్సుల్లో, ఇటు ప్రైవేట్ వాహనాల్లో లక్షల మంది మేడారంకు తరలివస్తున్నారు. 13 వేల మంది సిబ్బందితో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



# మేడిగడ్డతో..ముప్పు

భద్రతను నిర్ధారించడానికి, సంబంధిత విపత్తులను నివారించడానికి తక్షణ చర్యలు అవసరమని కేంద్రం తన నివేదికలో పేర్కొంది. ఈ మేరకు లోక్‌సభలో ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

### కేటగిరీ-1లో మూడు డ్యామ్‌లు

జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) 2025 వర్షాకాలం తర్వాత నిర్వహించిన తనిఖీల్లో మూడు ప్రధాన జలాశయాలను కేటగిరీ-1 (అత్యంత ప్రమాదకరం) కింద వర్గీకరించారు. కేటగిరీ-1 కింద వర్గీకరించడమంటే.. నిర్మాణ పరంగా అది తీవ్రమైన వైఫల్యాలను ఎదుర్కొంటోందని అర్థం. మరమ్మతులలో జాప్యం జరిగితే దిగువన ఉన్న గ్రామాలపై దాని ప్రభావం పడే అవకాశం ఉంటుంది. జలాశయాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిరంతర పర్యవేక్షణ ఉండాలని కేంద్రమంత్రి సూచించారు. అందులో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీ, ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరి డ్యామ్, ఝార్ఖండ్‌లోని బొకారో బ్యారేజీ ఉన్నాయి. ఈ జలాశయాల భద్రత విషయంలో తక్షణమే నివారణ చర్యలు , మరమ్మతులు చేపట్టకపోతే భారీ రిస్క్ పొంచి ఉందని కేంద్రం స్పష్టం చేసింది. డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం ప్రతి ఏటా వర్షాకాలం ముందు మరియు తర్వాత జలాశయాల భద్రతను తనిఖీ చేయడం తప్పనిసరి. 2025లో వర్షాకాలం ముందు 6,524 డ్యామ్‌లను, వర్షాకాలం తర్వాత 6,553 డ్యామ్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. భారతదేశంలో ప్రస్తుతం 50 ఏళ్లు పైబడిన జలాశయాలు 1,681 ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఇవి కాలం చెల్లిన నిర్మాణాలు కావడంతో వీటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# డిజిటల్ సిండ్రోమ్

మొదటి పేజీ తరువాయి

ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వివరించింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టినట్లు సర్వే వెల్లడించింది. మానసిక ఆరోగ్య సహాయం కోసం 'టెలీ-మానస్' కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 32 లక్షల కాల్స్ స్వీకరించినట్లు తెలిపింది. టెక్నాలజీ వ్యసనానికి చికిత్స అందించేందుకు బెంగళూరులోని నిమ్హాన్స్‌లో 'షట్' క్లినిక్, ఆన్‌లైన్ గేమింగ్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక చట్టం (2025) వంటివి అమలు చేస్తున్నట్లు పేర్కొంది. డిజిటల్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించడం సాధ్యం కానందున, ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని సర్వే సూచించింది. పాఠశాలల్లో 'డిజిటల్ వెల్‌నెస్' పై అవగాహన కల్పించే పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆఫ్‌లైన్ యూత్ హబ్స్ ఏర్పాటు చేయడం వంటివి అవసరమని తెలిపింది. యువత భవిష్యత్తును బలోపేతం చేసేందుకు శారీరక, మానసిక ఆరోగ్యంపై సమగ్ర దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.

# జీడీపీ 7.2 శాతం!

మొదటి పేజీ తరువాయి

7.2% మధ్య ఉండవచ్చు. ఇది స్థిరమైన వృద్ధి అని, అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు, ఆర్థిక ఒత్తిడి ఉన్నా భారత్ బలంగా ఉంటుందని సర్వే చెప్పింది. 2025-26 ఆర్థిక సంవత్సరం, అంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అంచనాల ప్రకారం జీడీపీ వృద్ధి 7.4% గా ఉంటుందని సర్వే అంచనా వేసింది. గత ఏడాది సర్వేలో 6.3-6.8% అని అంచనా వేశారు. కానీ ఇప్పుడు అంచనా చాలా పెరిగింది. 2025 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 6.5 శాతంగా ఉంది. భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ. అమెరికా, చైనా, జర్మనీ తర్వాత నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. ఆర్థిక వ్యవస్థ సామర్థ్యం మధ్యకాలంలో సాధారణ వృద్ధి రేటు 7 శాతం వరకు పెరిగింది. గతంలో 6.శాతం ఉండేది.ఇన్వెస్ట్‌మెంట్ పెరగడం, మాన్యుఫాక్చరింగ్ బలపడడం, జీఎస్టీ తగ్గింపు వంటి సంస్కరణల వల్ల ఇది సాధ్యమైంది. ద్రవ్యోల్బణం తక్కువగా ఉండటం వల్ల ఆర్బీఐ 2025లో వడ్డీ రేట్లు 1.25 శాతం తగ్గించింది. ఇది క్రెడిట్, డిమాండ్ పెంచింది. ఈ ఏడాది మొదటి అర్ధ భాగంలో 8 శాతం వృద్ధి నమోదైంది. రెండో అర్ధభాగంలో 6.9 శాతంగా నమోదవుతుందని అంచనా. 2026 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 4 ట్రిలియన్ డాలర్ల మార్క్ దాటే అవకాశం ఉంది. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ కూడా భారత్ అతి వేగంగా పెరుగుతుందని చెప్పాయి. కానీ వీటి అంచనాలు కొంచెం తక్కువగా 6.5-6.6 శాతంగా ఉన్నాయి. ఇక, అంతర్జాతీయంగా రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా టారిఫ్‌లు (భారత ఎగుమతులపై 50% వరకు) వల్ల సమస్యలు ఉన్నాయి. రష్యా నుంచి ఆయిల్ కొనడం వల్ల అమెరికా టారిఫ్‌లు పెంచింది. దీని వల్ల టెక్స్‌టైల్స్, జ్యువెలరీ, లెదర్ వంటి రంగాలు దెబ్బతిన్నాయి. కానీ ఇతర దేశాలతో (ఈయూ, యూకే, న్యూజీలాండ్, ఒమన్) ట్రేడ్ ఒప్పందాలు చేసుకోవడం వల్ల ఎక్స్‌పోర్ట్‌లు డైవర్సిఫై



అవుతున్నాయి. ఒకే మార్కెట్‌పై ఆధారపడకుండా రక్షణ పొందుతున్నాం. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చేయాలి. దానికి సగటు 8 శాతం వృద్ధి కావాలి. కానీ చాలా ఎకనామిస్టులు అది కష్టమని చెబుతున్నారు. గత 10 ఏళ్లలో సగటు 7 శాతం వృద్ధి ఉంది. అది సాధ్యమైన రేటుగా ఆర్బీఐ చూస్తోంది. మొత్తంగా, భారత ఆర్థిక వ్యవస్థ బలంగా, స్థిరంగా ఉంది. ప్రపంచ సమస్యలు ఉన్నా దేశీయ డిమాండ్, సంస్కరణల వల్ల మంచి భవిష్యత్తు ఉంది' అని సర్వే వెల్లడించింది.

## మేడారం.. ఇది యాపారం!

**ఆకాశాన్నంటుతున్న కోళ్లు, మేకలు, గొర్రెల ధరలు**

(మేడారం - ఈవార్తలు ప్రత్యేక ప్రతినిధి)

మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులు పోటెత్తుతున్నారు. అమ్మవార్లకు నిలువెత్తు బంగారం (బెల్లం)తోపాటు కోళ్లు, మేకలు, గొర్రెలను బలి ఇవ్వడం మేడారం జాతరలో ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయతీ. దీంతో, మేడారంలో కోళ్లు, మేలు, గొర్రెల అమ్మకాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. లక్షల సంఖ్యలో కోళ్లు, వేల సంఖ్యలో మేకలు, గొర్రెల విక్రయాలు జరుగుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు వీటి ధరలను అమాంతం పెంచేశారు. సాధారణంగా కిలో రూ. 200 నుంచి రూ. 250 ఉండే కోడి ధర, జాతరలో రూ. 350 నుంచి రూ. 400 వరకు పలుకుతోంది. ఇక మేకలు, గొర్రెల పరిస్థితిలో కూడా తేడా లేదు. సాధారణ రోజుల్లో రూ. 7 వేల నుంచి రూ. 8 వేల వరకు పలికే మేక పోతులను ప్రస్తుతం రూ. 12 వేల నుంచి రూ. 15 వేల వరకు విక్రయిస్తున్నారు. ధరలు ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ, మొక్కుబడి తీర్చుకోవాలనే ఉద్దేశంతో భక్తులు భరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వీటిని కొనుగోలు చేస్తున్నారు. జాతర ముగిసే వరకు ఈ ధరలు ఇలాగే ఉండే అవకాశం ఉంది.









# గద్దె పైకి చేరుకున్న సమ్మక్క తల్లి..

మేడారం మహాజాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తుతున్నారు. వనదేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. నిన్న (బుధవారం) సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజు గద్దెలపైకి చేరుకున్నారు. గద్దెలపైకి వనదేవతల ఆగమనంతో మేడారం జాతరలో తొలిఘట్టం పూర్తయింది. కుంకుమ భరిణ రూపంలో సారలమ్మ గద్దెలపైకి చేరుకున్నారు. గురువారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో సమ్మక్క తల్లి గద్దెపైకి చేరుకున్నారు.

## కేంద్రమంత్రులు మొక్కులు

**నిలువెత్తు బంగారం సమర్పించిన ఓరం, కిషన్ రెడ్డి**

(మేడారం - ఈవార్తలు ప్రత్యేక ప్రతినిధి)

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను కేంద్ర మంత్రులు గురువారం సందర్శించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద వారికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాదర స్వాగతం పలికారు. గిరిజన డప్పు వాయిద్యాల మధ్య ఆలయంలోకి ప్రవేశించిన కేంద్ర మంత్రులు, గద్దెలపై 'నిలువెత్తు బంగారం'



సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం జువల్ ఓరం మీడియాతో మాట్లాడుతూ, సమ్మక్క - సారలమ్మ జాతర గిరిజనుల మహా కుంభమేళా అని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు, 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని, పీఎం జన్‌మన్ పథకం కింద రూ. 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య పాఠశాలలు కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, జాతర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధికి రూ. 80 కోట్లు, రామప్ప ఆలయానికి రూ. 40 కోట్లు, జాతర ఏర్పాట్లకు ఈ ఏడాది రూ. 3.70 కోట్లు కేటాయించినట్లు వివరించారు. మేడారంలో సమ్మక్క - సారలమ్మ పేరుతో రూ. 890 కోట్ల వ్యయంతో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. త్వరలోనే ప్రధాని ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభిస్తారని ఆయన స్పష్టం చేశారు.









## మేడారంలో శాశ్వత కాటేజీలు

**70 ఎకరాల్లో ఆలయ విస్తరణకు ప్లాన్**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి**

(మేడారం - ఈవార్తలు ప్రత్యేక ప్రతినిధి)

మేడారం సమ్మక్క-సారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 80 లక్షల మంది భక్తులు మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శనం చేసుకున్నారని సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని స్పష్టం చేశారు. మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని మరో 41 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు.



# భారత్–ఈయూ డీల్ భేష్

## అంతర్జాతీయ మీడియా ప్రశంసలు.. వేనోళ్ల కొనియాడిన విదేశీ నాయకులు

హైదరాబాద్, జనవరి 29 (పీఐబీ):భారత్–ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా బలమైన, సానుకూల స్పందనలను పొందింది. అంతర్జాతీయ మీడియా, విదేశీ నేతలు, ప్రపంచ వ్యాపార ప్రముఖులు, విధాన నిపుణులు ఈఎఫ్టీఏను ప్రశంసించారు. ఆర్థికంగా, భౌగోళిక రాజకీయంగా వ్యూహాత్మకమైన ఈ చారిత్రాత్మక ఒప్పందం సరైన సమయంలో కుదిరిందన్న అభిప్రాయం వ్యక్తంమవుతోంది. భారత్–ఈయూ ఎఫ్టీఏ పరిధిని, ఆశయాన్ని, వ్యూహాత్మక సమయాన్ని ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థలు ప్రముఖంగా ప్రస్తావించాయి. వాణిజ్య ఒప్పందాలన్నింటి తలమానికమైన ఈయూతో జరిగిన వాణిజ్యం ఒప్పందంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీనే అసలైన విజేత' అంటూ జేమ్స్ క్రిస్ప్ రాసిన కథనం ద్వారా 'ది టెలిగ్రాఫ్' పత్రిక ఈ ఒప్పందాన్ని అత్యంత గొప్పదిగా అభివర్ణించింది. నిజమైన వ్యూహాత్మక విజేతగా భారత్ అవతరించిందని వాదించింది. భారత్కు ఐరోపా సమాఖ్య చేసే ఎగుమతుల్లో 96.6 శాతంపై సుంకాలను ఈ ఒప్పందం తొలగిస్తుందని లేదా తగ్గిస్తుందని ఆ పత్రిక పేర్కొంది. అదే సమయంలో రాబోయే ఏడేళ్లలో భారతీయ వస్తువులపై 99.5 శాతం మేర సుంకాలను ఈయూ తగ్గించనున్నట్లు ప్రస్తావించింది. సుంకాల విషయంలో ఏర్పడిన అంతరాయాలకు మధ్యస్థాయి ఆదాయ దేశాలు ఇచ్చిన ప్రతిస్పందనగా ఈ ఒప్పందాన్ని 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' అభివర్ణించింది. అమెరికా వాణిజ్య విధానాల వల్ల తలెత్తిన అనిశ్చితి మధ్య తమ కూటములను భారత్, ఈయూ విస్తరించుకుంటున్న తీరును ఇది ప్రముఖంగా పేర్కొంది. దాదాపు రెండు దశాబ్దాల చర్చల తర్వాత ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక కూటమిని, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థను ఈ ఒప్పందం ఏకం చేస్తుందని 'ది న్యూయార్క్ టైమ్స్' ప్రధానంగా చెప్పింది. దీనిని చారిత్రాత్మక ఒప్పందంగా 'ది వాషింగ్టన్ పోస్ట్' పేర్కొంది. 'చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో అన్ని ఒప్పందాలకే తలమానికం అయిన ఒప్పందాన్ని కుదుర్చుకున్న భారత్– ఈయూ' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. 'అన్ని ఒప్పందాలకు తలమానికం': స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసిన ఈయూ, భారత్' అని 'ది గార్డియన్' పత్రిక పేర్కొంది. అదే విధమైన శీర్షికతో 'అన్ని వాణిజ్య ఒప్పందాలకు తలమానికమైన ఒప్పందాన్ని ప్రకటించిన భారత్, ఈయూ' అని బీబీసీ నివేదించింది. గతంలో కార్లపై 100 శాతం కంటే ఎక్కువ ఉన్న సుంకాలు 10 శాతం కంటే తక్కువకు




పడిపోతాయని, వాహన విడిభాగాలపై సుంకాలు పూర్తిగా తొలగిపోనున్నట్లు పేర్కొంటూ సరఫరా వ్యవస్థ అనుసంధానం గురించి 'బ్లూమ్‌బెర్గ్' విశ్లేషించింది. 'ప్రపంచ వాణిజ్యంలో మూడో వంతుకు ప్రాతినిధ్యం వహించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్న భారత్, ఐరోపా సమాఖ్య' అనే శీర్షికతో 'అసోసియేటెడ్ ప్రెస్' ఈ ఒప్పంద పరిధిని ప్రధానంగా ప్రస్తావించింది. 'అన్ని ఒప్పందాలకు తలమానికం': భారత్–ఈయూ వాణిజ్య ఒప్పందం 27 ట్రిలియన్ డాలర్ల మార్కెట్‌ను ఎలా సృష్టిస్తుంది' అని పేర్కొంటూ 'అల్ జజీరా' కూడా ఈ ఒప్పందానికి ఉన్న స్థాయిని పేర్కొంది. ఈ ఒప్పందాన్ని ఒక కీలకఘట్టంగా 'రాయిటర్స్' అభివర్ణించింది. 'మైలురాయి వంటి వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్న భారత్, ఈయూ– చాలా వస్తువులపై సుంకాలు భారీగా తగ్గింపు' అని వ్యాఖ్యానించింది.

### విదేశీ నాయకుల ప్రశంసలు

ఐరోపాకు చెందిన పలువురు సీనియర్ రాజకీయ నాయకులు ఈ ఒప్పందాన్ని బహిరంగంగా స్వాగతించారు. చర్చల ముగింపును ఒక 'అత్యంత సానుకూల సంకేతం'గా జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ అభివర్ణించారు. వృద్ధి, శ్రేయస్సును పెంచడానికి దీనిని త్వరగా అమలు చేయాలని ఆయన కోరారు. భారత్–ఈయూ ఎఫ్టీఏను చారిత్రాత్మకమైనదిగా, ఇరుపక్షాలు కుదుర్చుకున్న అతిపెద్ద వాణిజ్య ఒప్పందంగా ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ అభివర్ణించారు. ఇది ఆర్థిక, రాజకీయ సంబంధాలను గణనీయంగా బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. సహకారానికి సంబంధించిన కొత్త యుగానికి నాంది ఈ ఒప్పందం అన్న స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్సన్.. వాణిజ్యం – భాగస్వామ్యం ద్వారా శ్రేయస్సు, పోటీతత్వం, భద్రతను ఇది బలపరుస్తుందన్నారు. ఈ ఒప్పందం రెండు బిలియన్ల ప్రజలకు ప్రయోజనం చేకూర్చే స్వేచ్ఛా వాణిజ్య మండలిని ఏర్పాటు చేస్తుందని ఆస్ట్రియా ఛాన్స్‌లర్ క్రిస్టియన్ స్టాకర్ అన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచ క్రమంలో ఐరోపా దృఢత్వం కోసం ఇది ఒక ప్రధాన అడుగు అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందానికి పూర్తి మద్దతు తెలిపిన డెన్మార్క్ విదేశాంగ మంత్రి లార్స్ లక్కే రాస్ముస్సేన్.. భౌగోళిక రాజకీయ పరిస్థితుల పరంగా ఇది అత్యంత కీలకమైనదని అన్నారు. రెండు బిలియన్ల ప్రజల ఉమ్మడి మార్కెట్‌లో మొదటగా ప్రవేశించే వారికి లభించే ప్రయోజనాన్ని ఆయన ప్రధానంగా చెప్పారు. భారత్–ఈయూ ఒప్పందాన్ని ఒక ప్రధాన రాజకీయ ముందడుగుగా పేర్కొన్న ఫ్రాన్స్ విదేశీ వాణిజ్య, ఆర్థిక శాఖ సహాయ మంత్రి నికోలస్ ఫోరిసియర్.. 'ఇది ఇతర ఒప్పందాల వంటిది కాదు' అని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం భాగస్వామ్యాలను వైవిధ్యపరచుకోవాల్సిన, స్వయంప్రతిపత్తిని పెంచుకోవాల్సిన ఈయూ అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తోందని ఐరోపా పార్లమెంట్ సభ్యుడు సాండ్రో గోజి అన్నారు. భారత్‌ను ఒక ప్రధాన ప్రపంచ శక్తిగా పేర్కొన్న ఆయన.. భౌగోళిక రాజకీయ పరిస్థితులు, దౌత్యపరమైన కోణం నుంచి ఈ ఒప్పందం భారతీయులకూ, యూరోపియన్లకూ గొప్ప అవకాశాలను అందిస్తుందని అభిప్రాయపడ్డారు. భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐరోపా, ప్రపంచ దేశాలకు చెందిన వ్యాపార నాయకులు ఈ ఒప్పందాన్ని ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఒక గొప్ప ముందడుగుగా అభివర్ణిస్తూ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 20 ఏళ్ల చర్చల తర్వాత ఈ ఎఫ్టీఏ కుదరటాన్ని ఒక 'గొప్ప క్షణం'గా ఎయిర్‌బస్ ఇండియా– దక్షిణాసియా ప్రెసిడెంట్– మేనేజింగ్ డైరెక్టర్, ఫెడరేషన్ ఆఫ్ యూరోపియన్ బిజినెస్ ఇన్ ఇండియా ప్రెసిడెంట్ జుర్గెన్ వెస్టర్‌మీర్ పేర్కొన్నారు. ఇది ఇరుపక్షాలకు అవకాశాలను వేగవంతం చేసే శక్తిగా పనిచేస్తుందని ఆయన అన్నారు. దీనినొక 'అద్భుతమైన రోజు'గా ఎయిర్‌బస్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు వౌటర్ వాన్ వెర్ష్ అభివర్ణించారు. 'భారత్‌లో తయారీ', సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, రక్షణ, అంతరిక్షం, అత్యాధునిక తయారీ రంగాల పట్ల ఎయిర్‌బస్ దీర్ఘకాలిక నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం రెండు బిలియన్ల ప్రజలను, ప్రపంచ జీడీపీలో దాదాపు నాలుగో వంతును ఏకం చేస్తుందని ఇండో–జర్మన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ జనరల్ జాన్ నోయెథర్ అన్నారు. ' స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలన్నింటికీ తలమానికం' అని ఆయన పేర్కొన్నారు. ఫ్రాంక్ ష్లోడర్ (హేఫెలే దక్షిణాసియా కార్యనిర్వాహక అధ్యక్షులు), థామస్ వోల్టర్ (క్రోన్స్ మెషినరీ ఇండియా కార్యనిర్వాహక అధ్యక్షులు), లార్స్ ఎరిక్ జోహన్సన్ (ఆక్సియా జీఎంబీహెచ్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు), జాన్–ఓలోఫ్ జాక్ (స్వీడిష్ ఎంటర్‌ప్రైజ్ కాన్ఫెడరేషన్ సీఈఓ), ఫ్రెడరిక్ పెర్సన్ (బిజినెస్ యూరప్ అధ్యక్షులు) వంటి ఇతర సీనియర్ వ్యాపార ప్రతినిధులు.. ఈ ఒప్పందాన్ని నియమ ఆధారిత వాణిజ్యం, సరఫరా వ్యవస్థ దృఢత్వం, ఎస్ఎంఈ వృద్ధి, దీర్ఘకాలిక పోటీతత్వానికి బలమైన సంకేతంగా పేర్కొన్నారు. ఈ ఒప్పందాన్ని అంతర్గతంగా పటిష్ఠమైనదిగా, వ్యూహాత్మకంగా సరైన సమయంలో కుదిరినదిగా ప్రపంచ విధాన నిపుణులు, వ్యాఖ్యాతలు అభివర్ణించారు. ఈ ఒప్పందం ప్రపంచ జనాభాలో నాలుగో వంతును, ప్రపంచ వాణిజ్యంలో భారీ వాటాను.. దగ్గరకు తెస్తుందని సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (సీఎస్ఐసీ) సీనియర్ సలహాదారులు రిచర్డ్ రోసో వ్యాఖ్యానించారు. దీనిలో సానుకూల దృక్పథంతో పాటు ఆలోచన కూడా బలంగా ఉందని ఆయన అన్నారు. ఇటీవల భారత్ కుదుర్చుకున్న ఎఫ్టీఏలు.. లోతైన, ప్రతిష్ఠాత్మకమైన వాణిజ్య హామీల వైపు స్పష్టమైన మార్పును తెలియజేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. భారత్– ఈయూ ఎఫ్టీఏను 'సరైన సమయంలో కుదిరిన సరైన ఒప్పందం' అని అట్లాంటిక్ కౌన్సిల్ సీనియర్ ఫెలో మైఖేల్ కుగెల్మాన్ అన్నారు. ఇది కేవలం అమెరికా సుంకాల నుంచి రక్షణ పొందడమే కాకుండా వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సుస్థిరం చేస్తుందని ఆయన ప్రముఖంగా చెప్పారు.




## న్యాయవాదులు సరైన ప్రతినిధిని ఎన్నుకోవాలి

**సీనియర్ అడ్వకేట్ కాసుల వినోద్**

హైదరాబాద్, జనవరి 29 (ఈవార్తలు):హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికల్లో న్యాయవాదులు సరైన ప్రతినిధిని ఎన్నుకోవడంలో విఫలమైతే న్యాయం తిరస్కరించబడుతూనే ఉంటుందని, అందువల్ల సరైన ప్రతినిధిని ఎన్నుకోవాలని సీనియర్ అడ్వొకేట్ కాసుల వినోద్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బార్ కౌన్సిల్ సభ్యునిగా పోటీ చేస్తున్న బి.శంకర్ కు మద్దతుగా న్యాయవాదులతో కలిసి గురువారం ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు నేడు న్యాయం కోసం నిలబడకపోతే, మనకు ఇంకెప్పుడూ అవకాశం రాకపోవచ్చునని అన్నారు. తన దైర్యం సమగ్రతను ఇప్పటికే నిరూపించుకున్న నాయకుడు శంకర్ కు మీ విలువైన ఓటును వేయాలని ఆయన న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు.

**వన్ మ్యాన్ ఆర్మీ.. బీ శంకర్**

ఇతరులు మౌనం వహించాలని నిర్ణయించినప్పుడు బి. శంకర్ లేచి నిలబడి న్యాయం కోసం తన గొంతును పెంచారు. న్యాయవాదులు కష్టపడి సంపాదించిన సంక్షేమ నిధులు దుర్వినియోగం మరియు మోసం జరిగినప్పుడు ఆయన బార్ కౌన్సిల్‌కు వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడారు.



## ముమ్మరంగా అరవ లక్ష్మి ఇంటింటి ప్రచారం

జగిత్యాల టౌన్, జనవరి 29 (ఈవార్తలు): పురపాలికల్లో ఎన్నికల జోరు మొదలైంది. నామినేషన్లు వేస్తున్న అభ్యర్థులు వెంటవెంటనే ప్రచారాన్ని మొదలుపెడుతున్నారు. తాజాగా, జగిత్యాలలో 22వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా బీజేపీ నేత అరవ లక్ష్మి – ఏసీఎస్ రాజు నామినేషన్ వేశారు. ఆ వెంటనే విద్యానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించిన ఆమె.. బీజేపీకి ఓటు వేయాలని కోరారు. మున్సిపాలిటీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని అన్నారు. జగిత్యాలను ఉన్నతంగా మార్చుకొనేందుకు ఓటును ఆయుధంగా మలిచి, బీజేపీకి ఓటు చేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో సీనియర్ నాయకులు బాశెట్టి దుబ్బరాజం, చిట్ల గంగాధర్, అక్కినపెల్లి కాశీనాథం, సతీశ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌పై గౌరవం ఉంది: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, జనవరి 29 (ఈవార్తలు): తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు నంది నగర్ లోని ఆయన నివాసంలో సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. కేసీఆర్ వయసును దృష్టిలో ఉంచుకొని ఆయన కోరిన ప్రదేశంలోనే విచారిస్తామని సిట్ అధికారులు తమ నోటీసుల్లో పేర్కొన్నారు. మరోవైపు, కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడంపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వ్యవహారంలో పారదర్శకంగా సిట్ విచారణ జరుగుతోందని ఆయన అన్నారు. కేసీఆర్ పై తమకు ఎంతో గౌరవం ఉందని... అయితే, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవరెవరి భాగస్వామ్యం ఉందో నిగ్గుతేలాల్సి ఉందని చెప్పారు. అప్పటి సీఎం, మంత్రుల ఆదేశాలు లేకుండా ఇంతటి భారీ స్థాయి ఉల్లంఘనలు జరిగే అవకాశమే లేదని ఆయన అన్నారు. పూర్తి స్థాయిలో సిట్ దర్యాప్తు జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఎవరికైనా నోటీసులు ఇచ్చే అధికారం సిట్ కు ఉందని... కేసీఆర్‌కు నోటీసుల విషయంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని చెప్పారు. బాధ్యులు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

## విమానాల్లో భద్రత ప్రమాణాలు పెరగాలి

**రామ్మోహన్ నాయుడికి విజయసాయిరెడ్డి విజ్ఞప్తి**

విజయవాడ, జనవరి 29 (ఈవార్తలు): భారత విమానయాన రంగంలో భద్రతా ప్రమాణాలను పటిష్టం చేయడంపై తక్షణమే దృష్టి సారించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరారు. దేశంలో విమాన ప్రయాణాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, భద్రతాపరమైన చర్యలు కూడా అదే స్థాయిలో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. విజయసాయి రెడ్డి తన ప్రకటనలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. "భారత్‌లో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య ఏటా 10 నుంచి 12 శాతం పెరుగుతోంది. 2047 నాటికి దేశవ్యాప్తంగా 400 విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నప్పుడు, ఆ వృద్ధికి తగ్గట్టుగా విమాన ట్రాఫిక్ భద్రతను కూడా మెరుగుపరచాలి" అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న కొన్ని సంఘటనల వల్ల ప్రయాణికుల్లో భద్రతపై విశ్వాసం సన్నగిల్లుతోందని విజయసాయి రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)ను ఆధునికీకరించాలని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో సిబ్బందిని, సాంకేతికతను బలోపేతం చేయాలని సూచించారు. విమానాల నిర్వహణలో లోపాలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కీలకమైన అంశంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వ్యక్తిగతంగా దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మున్సిపల్ ఎన్నికల కోసమే నోటీసులు: కవిత

హైదరాబాద్, జనవరి 29 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం ఇరు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. సిట్ నోటీసుల నేపథ్యంలో కేసీఆర్ కూతురు, జాగృతి అధ్యక్షురాలు కవిత స్పందిస్తూ... కీలక వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికలు ఉన్నందునే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. సిట్ విచారణ నాన్–సీరియస్ గా జరుగుతోందని, ఎన్నికల నేపథ్యంలోనే కేసీఆర్ కు నోటీసులు ఇచ్చారని అన్నారు. కేసును సీరియస్ గా తీసుకుని త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని... అయితే, కేసును ముగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా? లేదా? అనేది ఎవరికీ అర్థం కాని పరిస్థితి ఉందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ జరగడం నిజంగానే చాలా బాధాకరమని... కానీ, దానికి తగినటువంటి పర్యవసానాలను నేరస్తులు ఎదుర్కొంటారా? లేదా? అనేది వేచిచూడాలని అన్నారు.

# హైదరాబాద్‌లో హైడ్రా కొరడా

**జూబ్లీహిల్స్ 'నీరూస్'కు తాళాలు**




హైదరాబాద్, జనవరి 29 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో అగ్నిమాపక భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఉక్కుపాదం మోపింది. ఇటీవల నాంపల్లిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసిన అధికారులు.. గురువారం జూబ్లీహిల్స్‌లోని ప్రముఖ వస్త్ర దుకాణం 'నీరూస్' తో పాటు నాంపల్లిలోని మరో ఫర్నిచర్ షోరూంను సీజ్ చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లోని నీరూస్ షోరూంలో తనిఖీ చేయగా తీవ్రమైన ఉల్లంఘనలు బయటపడ్డాయి. మూడు సెల్లార్లు, నాలుగు అంతస్తులతో పాటు, అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన రూఫ్ షెడ్‌లో కూడా భారీగా వస్త్రాలను నిల్వ ఉంచడాన్ని అధికారులు గుర్తించారు. ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ లేకపోవడం, మంటలను ఆర్పే పరికరాలు సరిగా లేకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనం పై అంతస్తులను గోదాముగా, వస్త్రాల తయారీ కేంద్రంగా మార్చడంపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. వెంటనే షోరూంను సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం అధికారులు నాంపల్లి స్టేషన్ రోడ్డులోని రహీమ్, మన్నన్ ఎస్టేట్స్ స్టాండర్డ్ ఫర్నిచర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇటీవల ఐదుగురి మృతికి కారణమైన ప్రమాదం జరిగిన రోడ్డులోనే ఉన్నప్పటికీ ఈ షోరూంలో ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకపోవడాన్ని కమిషనర్ తీవ్రంగా పరిగణించారు. ఆరు అంతస్తుల భవనంలో మెట్ల మార్గాన్ని కూడా మూసివేసి ఫర్నిచర్ నిల్వ ఉంచడం, కనీసం ఫైర్ ఎక్స్టింగ్విషర్లు కూడా లేకపోవడంతో ఈ షోరూంను కూడా సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ రెండు షోరూంల వద్ద 'ఫైర్ అన్ సేఫ్' బోర్డులను ఏర్పాటు చేసి, హైడ్రా ఫెన్సింగ్ వేశారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. నగరంలో ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తే, తమ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజలను కోరారు. హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 9000113667 లేదా తన వాట్సాప్ నంబర్ 7207923085కు ఫొటోలు, వీడియోలతో సహా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేసినట్లే

**కేసీఆర్‌కు సిట్ నోటీసులపై హరీశ్ రావు ఫైర్**

హైదరాబాద్, జనవరి 29 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, ఈ కుతంత్రాలను తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ తెలంగాణ జాతి పిత అని, కోట్లాది మంది ప్రజల ఆరాధ్య దైవమని, అలాంటి నాయకుడిపై బురద చల్లాలని చూడటం సూర్యుడిపై ఉమ్మి వేయడమేనని వ్యాఖ్యానించారు. పాలనలో తమ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత



వ్యక్తమవుతోందని, ముఖ్యంగా సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సిట్ పేరుతో నోటీసుల డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ఠ అని దుయ్యబట్టారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూడటం రేవంత్ రెడ్డి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్ద కాలంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అని హరీశ్ రావు కొనియాడారు. కేసీఆర్ చరిత్రను సృష్టిస్తే, ఆ చరిత్రను మలినం చేసేందుకు రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, అహంకారం అంతకంటే కాదని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ సమాజం మొత్తం కేసీఆర్ వెంటే ఉందని, ప్రభుత్వ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హరీశ్ రావు హెచ్చరించారు.

## విచారణ కాదు.. ప్రతీకారం

**కేసీఆర్‌కు సిట్ నోటీసులపై కేటీఆర్ ఫైర్**

హైదరాబాద్, జనవరి 29 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది విచారణ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న రాజకీయ ప్రతీకార చర్య అని ఆయన అభివర్ణించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్, పాలనా లోపాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన మండిపడ్డారు. ఇది కేవలం న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని, రాజకీయ దురుద్దేశంతోనే ఈ నోటీసులు ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ.. "చావు నోట్లో తలపెట్టి, సచ్చుడో, తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని దీక్షతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహానాయకుడు కేసీఆర్. తన పదేళ్ల పాలనలో మిషన్ భగీరథ, రైతుబంధు, దళితబంధు వంటి పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారు. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని చూసుకున్నారు. అలాంటి నాయకుడిపై అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు విచారణల పేరుతో వేధించడం దుర్మార్గం" అని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నందుకే బీఆర్ఎస్ అధినేతపై కాంగ్రెస్ కక్ష కట్టిందని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, కేవలం నోటీసులు ఇచ్చి, బెదిరింపులకు పాల్పడి తెలంగాణ ఉద్యమ చరిత్రను, ఆయన కీర్తిని చెరిపేయలేరని హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించేది లేదని, ప్రజలే సరైన సమయంలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఈ కక్ష సాధింపు రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తోందని, ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ అన్యాయ పాలనపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కేటీఆర్ ఉద్ఘాటించారు. చరిత్రను విచారణలతో కాదని, ప్రజల తీర్పుతోనే రాస్తారని ఆయన వ్యాఖ్యానించారు.

## 12 అంకెలతో 'పశు ఆధార్'




దేశంలో పాడి పశువులకు ఆరోగ్య సేవలు, వ్యాక్సినేషన్ అందించేందుకు వీలుగా ఎన్‌డీడీబీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆనిమల్ హస్బెండరీ అండ్ డెయిరీయింగ్(డీఏహెచ్‌డీ) సంయుక్తంగా భారత్ పశుధాన్ అనే వ్యవస్థను అమలు చేస్తున్నాయి. పశువులకు 12 అంకెల విశిష్ట సంఖ్యతో కూడిన 'పశు ఆధార్'ను కేటాయిస్తోంది. పశువుల చెవిలకు ట్యాగ్‌పై ముద్రించే ఐడీ ద్వారా పశువుల వ్యాక్సినేషన్, చికిత్స వంటి వివరాలను తెలుసుకోవచ్చు. ఇప్పటివరకు దాదాపు 35.68 కోట్ల పశువులకు పశు ఆధార్ కేటాయించారు.



## సమస్య వస్తే టోల్‌ఫ్రీ

పాడి రంగానికి సంబంధించి ఉత్తమ విధానాలు, ప్రభుత్వ పథకాల గురించి రైతులకు వివరించేందుకు నేషనల్ డిజిటల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద ఎన్‌డీడీబీ 1962 టోల్ ఫ్రీ నెంబరు, మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పశువుల వైద్యానికి సంబంధించిన అన్ని సేవలను అరచేతిలోనే పొందేందుకు రైతులకు వీలు కలుగుతోంది.

## మెరుగైన పాల సేకరణ

డెయిరీ సహకార సంఘాల(డీసీఎస్) కార్యకలాపాలను మరింత మెరుగుపరిచేందుకు 'ఆటోమెటిక్ మిల్క్ కలెక్షన్ సిస్టమ్(ఏఎంసీఎస్)' అనే సమీకృత సాఫ్ట్‌వేర్‌ను ఎన్‌డీడీబీ అభివృద్ధి చేసింది. రైతుల నుంచి ఎన్ని పాలు సేకరించారు, పాల నాణ్యత, కొవ్వు శాతం వంటి వివరాలు ఇందులో నమోదవుతాయి. రైతులకు ఎప్పటికప్పుడు చెల్లింపులకు ఇది వీలు కల్పిస్తుంది. ఈ వివరాలన్నీ రైతులకు ఎస్ఎంఎస్ రూపంలో వెళ్తాయి. ఇది డిజిటల్ పాస్‌బుక్‌లా పని చేస్తోంది. ఈ సాఫ్ట్‌వేర్‌ను 26 వేల డెయిరీ సహకార సంఘాలు వినియోగిస్తున్నాయి. ఏఎంసీఎస్ ఫార్మర్స్ యాప్‌ను 2.43 లక్షల మంది పాడి రైతులు వినియోగిస్తున్నారు.



# దేశంలో మరో శ్వేతవిప్లవం


పాల ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ మొదటి స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న పాలలో మన దేశానిదే 25% వాటా. ప్రతి ఇంట పాడి పశువులు పెంచడం భారతీయ గ్రామీణ కుటుంబాలకు ఆనవాయితీగా వస్తోంది. శతాబ్దాలుగా దేశంలో సంప్రదాయ గ్రామీణ వృత్తిగా ఉన్న పాడి పరిశ్రమను మరింత విస్తృతం చేసేందుకు జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి మండలి(ఎన్‌డీడీబీ) పలు చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా డెయిరీ రంగానికి సాంకేతిక హంగులను జోడిస్తూ తెస్తున్న విప్లవాత్మక మార్పులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. పాడి పశువుల నిర్వహణ, పాల సేకరణ, రవాణాను సులభతరం చేస్తూ దేశ డెయిరీ రంగాన్ని బలోపేతం చేస్తున్నాయి.





### పాల వెల్లువకు సాంకేతిక హంగులు

- కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చిన ఎన్‌డీడీబీ
- పశు ఆధార్‌తో పశువుల నిర్వహణ సులభతరం
- అందుబాటులోకి ఆటోమెటిక్ మిల్క్ కలెక్షన్ వ్యవస్థ
- జీఐఎస్ సాంకేతికతతో మెరుగ్గా పాల రవాణా





### పాడి పరిశ్రమ నిర్వహణకు పోర్టల్, యాప్

పాడి పరిశ్రమలోని సంస్థల కార్యకలాపాల నిర్వహణకు ఆటోమెటిక్ మిల్క్ కలెక్షన్ సిస్టమ్(ఏఎంసీఎస్)కు అనుసంధానంగా పనిచేసే ఎన్‌డీడీబీ 'డెయిరీ ఆర్పీ(ఎన్‌డీఈఆర్‌పీ)'ని అభివృద్ధి చేసింది. ఈ పోర్టల్, యాప్‌ను డిస్ట్రిబ్యూటర్లు వినియోగించవచ్చు. స్మార్ట్‌ఫోన్ ద్వారా ఆర్డర్ చేయడానికి, డెలివరీలు పరిశీలించడానికి, ఇన్‌వాయిస్‌లు పొందడానికి, చెల్లింపులు పర్యవేక్షించడానికి ఇది ఉ పయోగపడుతుంది.

### సమర్థవంతంగా పాల రవాణా ప్రణాళిక

పాలను సేకరించి వీలైనంత వేగంగా వినియోగదారులకు అందించడం డెయిరీ రంగంలో కీలకం. ఈ రవాణా ప్రణాళిక అంతా మాన్యువల్‌గా జరిగేది. జీఐఎస్‌ను ఉపయోగించి మరింత మెరుగ్గా పాల రవాణా మార్గాన్ని నిర్ణయించేందుకు ఎన్‌డీడీబీ ఒక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. దీనిని వినియోగించడం ద్వారా పాల రవాణా వేగవంతం కావడంతో పాటు దూరాన్ని, ఇంధన ఖర్చును తగ్గించవచ్చు.

### డేటా మొత్తం డిజిటల్‌గానే..

డెయిరీ రంగంలో రాణించడానికి డేటా విశ్లేషణ, దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యం. ఇందుకోసం ఇంటర్నెట్ ఆధారిత డెయిరీ 'ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్(ఐ-డీఐఎస్)'ను ఎన్‌డీడీబీ అభివృద్ధి చేసింది. డెయిరీ సహకార సంఘాలు, పాల యూనియన్లు, ఫెడరేషన్లు, ఇతర అనుబంధ సంస్థలు పాడి రంగానికి సంబంధించిన డేటాను సేకరించడానికి, పంచుకోవడానికి, విశ్లేషించడానికి ఇది ఉపయోగపడుతుంది.

## పాకిస్థాన్‌కు వెళ్లొద్దు

**పౌరులకు అమెరికా అలర్ట్**

వాషింగ్టన్: పాకిస్థాన్‌లో నెలకొన్న భద్రతా పరిస్థితుల దృష్ట్యా, ఆ దేశానికి ప్రయాణాలు పెట్టుకోవద్దని అమెరికా తమ పౌరులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఉగ్రవాదం, నేరాలు, అంతర్యుద్ధం, కిడ్నాపుల వంటి ప్రమాదాలు పొంచి ఉన్నందున పాకిస్థాన్ ప్రయాణ ప్రణాళికలను పునఃసమీక్షించుకోవాలని అమెరికా విదేశాంగ శాఖ సూచించింది. ఈ మేరకు గురువారం కొత్త ట్రావెల్ అడ్వైజరీని విడుదల చేసింది. పాకిస్థాన్‌కు 'లెవెల్ 3' కేటగిరీ హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించింది. లెవెల్ 3 అంటే అధిక ప్రమాదం ఉన్న ప్రాంతమని, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని అర్థం. ప్రధాన రవాణా కేంద్రాలు, మార్కెట్లు, హోటళ్లు, షాపింగ్ మాల్స్, సైనిక స్థావరాలు, విమానాశ్రయాలు, రైళ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థనా స్థలాలు, పర్యాటక ప్రాంతాలు, ప్రభుత్వ భవనాలే లక్ష్యంగా దాడులు జరగవచ్చని అమెరికా విదేశాంగ శాఖ తన అడ్వైజరీలో వివరించింది. ముఖ్యంగా బలూచిస్థాన్ ప్రావిన్స్, ఖైబర్ పఖ్తుంఖ్వా (కేపీ) ప్రావిన్స్, గతంలో కేంద్ర పాలిత గిరిజన ప్రాంతాలుగా ఉన్న ప్రదేశాలకు 'లెవెల్ 4' హెచ్చరిక జారీ చేసింది. ఈ ప్రాంతాలకు ఎలాంటి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని స్పష్టం చేసింది. ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు, సాధారణ పౌరులే లక్ష్యంగా హత్యాయత్నాలు, కిడ్నాపులు సర్వసాధారణమని పేర్కొంది. పాకిస్థాన్ మూలాలున్న అమెరికన్ పౌరులకు కూడా ఈ హెచ్చరిక వర్తిస్తుందని స్పష్టం చేసింది. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వాలలో ఉగ్రవాదులు తరచూ దాడులకు పాల్పడుతున్నారని, కరాచీ, ఇస్లామాబాద్ వంటి ప్రధాన నగరాల్లోనూ దాడులు జరిగిన సందర్భాలు ఉన్నాయని అడ్వైజరీలో పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో అనుమతి లేకుండా నిరసనలు చేయడం చట్టవిరుద్ధమని, నిరసనలకు సమీపంలో ఉన్నా భద్రతా దళాల నిఘాకు గురయ్యే ప్రమాదం ఉందని అమెరికా హెచ్చరించింది. గతంలో నిరసనల్లో పాల్గొన్న అమెరికన్ పౌరులను నిర్బంధించినట్లు గుర్తు చేసింది. అంతేకాకుండా, పాకిస్థాన్ ప్రభుత్వం, సైన్యం లేదా అధికారులను విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా నిర్బంధించే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉండగా, జనవరి 21 నుంచి 75 దేశాలకు చెందిన వలస వీసాల ప్రాసెసింగ్‌ను ట్రంప్ ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ జాబితాలో పాకిస్థాన్, బంగ్లాదేశ్ కూడా ఉన్నాయి.

# ఖర్గే, రాహుల్‌తో శశిథరూర్ భేటీ

**ఒకే మాటపై ఉన్నామని వెల్లడి.. అసంతృప్తి ఊహాగానాలకు తెర**




న్యూఢిల్లీ: సీనియర్ కాంగ్రెస్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్.. పార్టీ నాయకత్వంతో తనకున్న విభేదాలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. గురువారం నాడు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సమావేశమైన అనంతరం, తామంతా ఒకే మాటపై ఉన్నామని స్పష్టం చేశారు. ఈ భేటీతో పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాల చర్చకు ముగింపు పలికే ప్రయత్నం చేశారు. పార్లమెంట్ భవనంలోని ఖర్గే ఛాంబర్‌లో దాదాపు రెండు గంటల పాటు ఈ సమావేశం జరిగింది. ఉదయం 11:15 గంటలకు ప్రారంభమైన ఈ భేటీలో మొదట కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. అయితే, చర్చలు ప్రారంభమైన కొద్దిసేపటికే ఆయన బయటకు వెళ్లిపోవడంతో ఖర్గే, రాహుల్, థరూర్ మధ్య ప్రైవేట్‌గా సంభాషణ కొనసాగింది. మధ్యాహ్నం 1:15 గంటలకు సమావేశం నుంచి బయటకు వచ్చిన థరూర్ ప్రశాంతంగా కనిపించారు. మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, "మా మధ్య సమావేశం జరిగింది. చెప్పాలనుకున్నవన్నీ చెప్పాం. ఇప్పుడు మేమంతా ఒకే మాటపై ఉన్నాం" అని అన్నారు. అనంతరం సోషల్ మీడియాలో స్పందించిన ఆయన, ఈ చర్చలు స్నేహపూర్వకంగా, ఫలప్రదంగా జరిగాయని పేర్కొన్నారు. భారత ప్రజలకు సేవ చేసే క్రమంలో పార్టీ ముందుకు సాగుతున్నప్పుడు నాయకత్వం అంతా ఒకే తాటిపై ఉందని స్పష్టం చేశారు. పార్టీ పనితీరుపై థరూర్ అసంతృప్తితో ఉన్నారంటూ ఇటీవల వెలువడిన వార్తల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటారా అని మీడియా ప్రశ్నించగా, థరూర్ సానుకూలంగా స్పందించారు. తన నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్రంలో పార్టీకి కట్టుబడి ఉన్నానని పునరుద్ఘాటించారు. భేటీ తర్వాత, సోషల్ మీడియా పోస్ట్ ద్వారా థరూర్ రెండుసార్లు ఐక్యత సందేశాన్ని వినిపించడంతో.. పార్టీలో నెలకొన్న ఊహాగానాలకు ప్రస్తుతానికి తెరపడినట్లేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# రికార్డు స్థాయిలో డీమ్యాట్ అకౌంట్లు

**భారత స్టాక్ మార్కెట్లపై పెరుగుతున్న ఆసక్తి**

**ఈ ఆర్థిక సంవత్సరంలో 2.35 కోట్ల కొత్త డీమ్యాట్ ఖాతాలు**

**12 కోట్లు దాటిన దేశంలోని మొత్తం మదుపర్ల సంఖ్య**



ముంబై: భారత క్యాపిటల్ మార్కెట్లలో రిటైల్ మదుపర్ల భాగస్వామ్యం సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో డిసెంబరు వరకు కేవలం 9 నెలల కాలంలోనే దేశవ్యాప్తంగా ఏకంగా 2.35 కోట్ల కొత్త డీమ్యాట్ ఖాతాలు తెరుచుకున్నాయి. గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2025-26 ఈ కీలక గణాంకాలను వెల్లడించింది. ఆర్థిక విషయాలపై ప్రజల్లో అవగాహన పెరగడం, మార్కెట్లపై నమ్మకం ఇనుమడించడమే ఇందుకు ప్రధాన కారణమని సర్వే పేర్కొంది. 2025 సెప్టెంబర్ నాటికే దేశంలో మొత్తం ప్రత్యేక డీమ్యాట్ మదుపర్ల సంఖ్య 12 కోట్లు దాటడం గమనార్హం. వీరిలో దాదాపు నాలుగో వంతు మహిళలు ఉన్నారు. పెట్టుబడులు కేవలం పెద్ద నగరాలకే పరిమితం కావడం లేదు. డిసెంబర్ నాటికి మ్యూచువల్ ఫండ్లలో ఉన్న 5.9 కోట్ల మంది మదుపర్లలో 3.5 కోట్ల మంది టైర్-×, టైర్-××యేతర నగరాలు, పట్టణాల నుంచే ఉండటం ఈ మార్పునకు నిదర్శనం. ప్రజలు తమ పొదుపును సంప్రదాయ మార్గాల నుంచి ఈక్విటీ, మ్యూచువల్ ఫండ్ల వైపు మళ్లిస్తున్నారని సర్వే స్పష్టం చేసింది. ముఖ్యంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ల ద్వారా పెట్టుబడులు భారీగా పెరిగాయి. 2017లో నెలకు సగటున రూ. 4,000 కోట్లుగా ఉన్న సిప్ పెట్టుబడులు, ఈ ఆర్థిక సంవత్సరంలో నెలకు రూ. 28,000 కోట్లకు పైగా పెరిగాయి. ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి ఉన్నప్పటికీ, బలమైన దేశీయ మదుపర్ల మద్దతు, ప్రభుత్వ విధానాలతో భారత ఈక్విటీ మార్కెట్లు నిలకడగా రాణించాయి. ఈ కాలంలో నిఫ్టీ 11.1 శాతం, సెన్సెక్స్ 10.1 శాతం చొప్పున లాభపడ్డాయి. గతేడాదితో పోలిస్తే ఐపీఓల సంఖ్య 20 శాతం పెరగ్గా, ఎస్ఎంఈ విభాగంలో 217 కంపెనీలు రూ. 9,600 కోట్లకు పైగా నిధులు సమీకరించాయని సర్వే వివరించింది.

## సెన్సెక్స్, నిఫ్టీ లాభాల పరుగు

**ఆర్థిక సర్వేతో ఇన్వెస్టర్లలో జోష్**

**వరుసగా మూడో రోజు లాభాలు**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు లాభాలతో ముగిశాయి. ప్రభుత్వం విడుదల చేసిన వార్షిక ఆర్థిక సర్వే ఇన్వెస్టర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. దేశ ఆర్థిక వృద్ధి, ద్రవ్యలోటుపై సర్వేలో సానుకూల అంచనాలు వెలువడటంతో, ఆరంభంలో ఒడుదొడుకులకు లోనైన సూచీలు చివరికి లాభాల్లో స్థిరపడ్డాయి. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి 6.8 నుంచి 7.2 శాతం మధ్య ఉంటుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. అలాగే, 2026 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు లక్ష్యమైన 4.4 శాతాన్ని చేరుకునే దిశగా దేశం పయనిస్తోందని పేర్కొనడం ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచింది. గురువారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 221.6 పాయింట్లు లాభపడి 82,566.37 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 76.15 పాయింట్లు పెరిగి 25,418.90 వద్ద స్థిరపడింది. ఈ సెషన్‌లో మెటల్, ఇన్ఫ్రా సంబంధిత స్టాక్స్ మంచి పనితీరు కనబరిచాయి. సెన్సెక్స్‌లో టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్, ఎన్‌టీపీసీ షేర్లు 4.5 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు, ఏషియన్ పెయింట్స్, ఇండిగో, మారుతీ సుజుకీ, టీసీఎస్, బీఈఎల్ వంటి షేర్లు నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3 శాతానికి పైగా దూసుకెళ్లగా, నిఫ్టీ హెల్త్‌కేర్, ఫార్మా, ఎఫ్ఎంసీజీ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సాంకేతికంగా నిఫ్టీకి 25,300 వద్ద తక్షణ మద్దతు ఉందని, ఒకవేళ ఈ స్థాయిని దాటితే 25,600-25,800 స్థాయిలకు చేరే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, యూనియన్ బడ్జెట్ సమీపిస్తుండటంతో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 0.12 తగ్గి 91.94 వద్ద బలహీనంగా ట్రేడ్ అయింది.

## యూజీసీ నిబంధనలపై స్టే

**సమానత్వ నిబంధనలను నిలిపివేసిన సుప్రీంకోర్టు**

**తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు 2012 నిబంధనలే**

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకొచ్చిన 2026 నిబంధనల అమలుపై సుప్రీంకోర్టు ఇవాళ మధ్యంతర స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు 2012 నాటి పాత నిబంధనలే అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వానికి, యూజీసీకి నోటీసులు జారీ చేసింది. యూజీసీ కొత్త నిబంధనలు జనరల్ కేటగిరీ విద్యార్థుల పట్ల వివక్ష చూపించేలా ఉన్నాయని, వారికి ఫిర్యాదు చేసే యంత్రాంగాన్ని నిరాకరిస్తున్నాయని ఆరోపిస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. "మేము జోక్యం చేసుకోకపోతే, ఇది ప్రమాదకరమైన ప్రభావాన్ని చూపుతుంది. సమాజాన్ని విభజిస్తుంది, తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది" అని ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం 'కుల ఆధారిత వివక్ష' అనే పదాన్ని కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకే పరిమితం చేశారని పిటిషనర్లు ఆరోపించారు. దీనివల్ల జనరల్ కేటగిరీకి చెందిన వారికి ఎలాంటి వివక్ష ఎదురైనా ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా పోతుందని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15(1), 21లను ఉల్లంఘించడమేనని వాదించారు. పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, 'సంపూర్ణ న్యాయం' కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తమకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి ఈ నిబంధనలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది.

ఈవార్తలు
# వినోదవాణి CINEMA
శుక్రవారం 30-1-2026 | www.evarthalu.com | 6



వయ్యారి చిత్రం




## రివ్యూ: ఓం శాంతి శాంతి శాంతిః

భార్యాభర్తల గొడవల నేపథ్యంలో చాలా సినిమాలు వచ్చాయి. ఓం శాంతి శాంతి శాంతి: కూడా ఇదే కోవలో వచ్చింది. కథ రొటీన్ గా ఉన్నా కూడా.. తీసుకున్న పాయింట్ కొద్దిగా ఇంట్రెస్టింగ్ అనిపిస్తుంది. సాధారణంగా భర్త కొడితే భార్య పడుతుంది అనుకుంటారు. కానీ వాళ్ళు తిరగబడితే ఏంటి పరిస్థితి.. ఇదే ఇంకాస్త చెప్పారు ఓం శాంతి శాంతిలో. ఆల్రెడీ ఒరిజినల్ చూసిన వాళ్లకు పెద్దగా కిక్ ఇవ్వకపోవచ్చు కానీ, మలయాళం వర్షన్ చూడని వాళ్ళు మాత్రం ఈ సినిమా బాగానే ఎంజాయ్ చేస్తారు. స్టార్టింగ్ 15 నిమిషాలు నెమ్మదిగా ఉంటుంది.. కానీ తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా పెళ్లి తర్వాత ఊపు అందుకుంటుంది. ఇంటర్వెల్ ముందు సినిమా పీక్ కు వెళ్తుంది. సెకండాఫ్ నాట్ బ్యాడ్.. కాకపోతే నెమ్మదిగా వెళ్ళింది కథ. కొన్ని పంచులు బాగా పేలాయి.. ముఖ్యంగా బ్రహ్మాజీ డైలాగులు..! తరుణ్ భాస్కర్ బాగా నటించాడు.. కామెడీ టైమింగ్ పర్లేదు. ఈషా రెబ్బా ఓకే.. కథ అంతా ఈమె మీదే ఉంది.

**ఓవరాల్ గా ఓం శాంతి శాంతి శాంతి..**

**ఒరిజినల్ చూడకపోతే పర్లేదు.. ఎంజాయ్ చేయొచ్చు..!**

**సమీక్షకుడు: ప్రవీణ్ కుమార్, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు**



## విశ్వంభర ఇంకెప్పుడు?

'భోళా శంకర్' డిజాస్టర్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి మొదలుపెట్టిన సినిమా 'విశ్వంభర'నే. 2025 సంక్రాంతి టార్గెట్‌గా ఈ సినిమాను మొదలుపెట్టారు. చకచకా షూటింగ్ కూడా పూర్తి చేశారు. మేకింగ్ దశలో ఈ సినిమాకు మంచి హైప్ వచ్చింది కూడా. కానీ టీజర్ రిలీజ్ చేశాక అంతా మారిపోయింది. సబ్‌స్టాండర్డ్ విజువల్స్, ఎఫెక్ట్స్ కారణంగా సోషల్ మీడియాలో బాగా ట్రోలింగ్ జరిగింది. టీం ఆత్మరక్షణలో పడిపోయింది. దీంతో రిలీజ్ వాయిదా వేసి.. విజువల్ ఎఫెక్ట్స్ మీద మళ్లీ పని చేయడం మొదలు పెట్టింది టీం. ఇలా వీఎఫెక్స్ మీద రీవర్క్ చేయడం మొదలుపెట్టి ఏడాది దాటిపోయింది. చాలా నెలల పాటు అసలు టీం నుంచి ఏ అప్‌డేట్ కూడా లేదు. ఐతే గత ఏడాది అందరిలోనూ అయోమయం నెలకొన్న సమయంలో టీం ఒక స్పష్టతనిచ్చింది. చిరు తర్వాత మొదలుపెట్టిన 'మన శంకర వరప్రసాద్' చిత్రానికి సైడ్ ఇస్తూ.. తమ సినిమాను 2026 వేసవికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. చెప్పిన ప్రకారమే వేసవిలో సినిమా రిలీజవుతుందని ఆశిస్తుంటే.. ఇప్పుడు మళ్లీ జులై 10 అంటూ కొత్త డేట్ తెరపైకి వచ్చింది. దీంతో మళ్లీ మాట తప్పడం ఏంటి.. వేసవి లాంటి క్రేజీ సీజన్‌ను ఎందుకు వదిలేస్తున్నారు.



## అనుపమ మౌనమేల?

మలయాళ భామ అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో ఏఆర్ జీవా డైరెక్టర్ గా పరిచయమవుతున్న సినిమా లాక్‌డౌన్. వాస్తవానికి ఈ సినిమా ఎప్పుడో రిలీజవాల్సింది కానీ కొన్ని కారణాల వల్ల పలు వాయిదాలు పడి ఆఖరికి జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. మరికొన్ని గంటల్లో రిలీజ్ కానున్న ఈ సినిమాకు బజ్ చాలా తక్కువ ఉంది. పైగా లైకా ప్రొడక్షన్స్ లాంటి సంస్థ మద్దతు ఉన్నప్పటికీ చెన్నై తప్ప మిగిలిన మెయిన్ సిటీల్లో కూడా ఈ సినిమాకు ఎలాంటి షో లు కేటాయించలేదు. ఇక అసలు విషయానికొస్తే ఈ సినిమా విషయంలో అనుపమ పరమేశ్వరన్ సైలెంట్ గా ఉండటం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేసినప్పుడు కానీ, దానికి ముందు కానీ, ఈ సినిమా గురించి అనుపమ సోషల్ మీడియాలో ఎలాంటి పోస్ట్ చేసింది లేదని, లైకా ప్రొడక్షన్ ప్రమోషన్స్ విషయంలో తమ వంతు కష్టం తాము పడుతున్నప్పటికీ, అనుపమ మాత్రం ఎలాంటి ప్రమోషన్స్ చేయకపోవడమేంటనేది అందరినీ ఆలోచనలో పడేసింది. ఇవన్నీ చూస్తుంటే అనుపమకు, చిత్ర యూనిట్ కు మధ్య ఏదైనా ప్రాబ్లమ్ ఉందే అనే విధంగా కూడా అనుమానాలొస్తున్నాయి.



## ఎన్టీఆర్ పేరు వాడితే చర్యలు

టాలీవుడ్ స్టార్ హీరో, యంగ్ టైగర్ ఎన్టీఆర్ పేరు, ఫోటోలు, గుర్తింపును అనుమతి లేకుండా వాడుతున్న డిజిటల్ దుర్వినియోగంపై ఢిల్లీ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్టీఆర్ వ్యక్తిత్వం, ప్రచార హక్కులకు (పర్సనాలిటీ ఓ పబ్లిసిటీ రైట్స్) చట్టపరమైన పూర్తి రక్షణ కల్పిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సమయంలో కీలక వ్యాఖ్యలు కూడా చేసింది. అయితే తన పేరు, ఇమేజ్, ట్యాగ్స్ ను సోషల్ మీడియా, వెబ్‌సైట్లు, డిజిటల్ ప్రకటనలు సహా పలు విధాలుగా అనధికారికంగా వాడుతున్నారంటూ ఎన్టీఆర్ ఇటీవల ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. మొత్తం వ్యవహారాన్ని పరిశీలించిన కోర్టు, ఎన్టీఆర్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన స్టార్ అని తెలిపింది. అంతే కాదు.. ఆయన పేరు, గుర్తింపునకు కమర్షియల్ వాల్యూ ఉందని స్పష్టం చేసింది. ఎన్టీఆర్ ను ప్రజలు ఎన్టీఆర్, తారక్, జూనియర్ ఎన్టీఆర్, నందమూరి తారక రామారావు జూనియర్ అనే పేర్లతో పాటు యంగ్ టైగర్, మ్యాన్

## పారిపోయి పెళ్లి చేసుకుందామనుకున్నాం

మహానటి కీర్తి సురేష్ చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరియర్ మొదలుపెట్టి..'నేను శైలజ' అనే సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే అమాయకత్వంతో , నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. తర్వాత మహానటి సినిమాలో దివంగత నటీమణి సావిత్రి పాత్ర పోషించి, తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. అంతేకాదు ఉత్తమ నటిగా ఏకంగా నేషనల్ అవార్డు అందుకొని సంచలనం సృష్టించింది. అంతేకాదు ఇండస్ట్రీలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే నేషనల్ అవార్డు అందుకున్న హీరోయిన్ గా రికార్డు సృష్టించింది ఈ ముద్దుగుమ్మ. ఇండస్ట్రీలో చాలా సంవత్సరాలుగా కొనసాగుతున్న కీర్తి సురేష్ ఇప్పటివరకు ఎలాంటి ఎఫైర్ రూమర్స్ ఎదుర్కోలేదు. ఇక ఎట్టకేలకు గత 15 సంవత్సరాలుగా రహస్యంగా ప్రేమించిన తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోనీ తట్టిల్ తో ఏడడుగులు వేసి అందరిని ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా ఈ విషయం తన తల్లిదండ్రులకు కూడా తెలియదని.. అయితే తన ప్రేమ విషయాన్ని మొదటగా జగపతిబాబుకు మాత్రమే చెప్పానని.. ఆ తర్వాత తన కుటుంబ సభ్యులకు చెప్పి ఒప్పించి వివాహం చేసుకున్నాను అంటూ గత ఇంటర్వ్యూలలో చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు తాజాగా మరో ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె తన వివాహ వేడుక గురించి మాట్లాడుతూనే.. తన 15 ఏళ్ల ప్రేమ కేవలం 30 సెకండ్లలో తన కళ్ళ ముందు కదలాడింది అంటూ చెప్పి ఎమోషనల్ అయింది. ఇంటర్వ్యూలో భాగంగా కీర్తి సురేష్ మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా నేను నా భర్త ఆంటోనీ తట్టిల్ తో ప్రేమలో ఉన్నాము. పెళ్లి చాలా వైభవంగా జరుగుతుందని నేనెప్పుడూ అనుకోలేదు. కారణం నేను ప్రేమించడం. అయితే కచ్చితంగా పారిపోయి పెళ్లి చేసుకుంటామని అనుకున్నాం." అంటూ కీర్తి సురేష్ తన ప్రేమ , పెళ్లి విషయాన్ని అభిమానులతో పంచుకుంది.














# రేపే భారత్ - పాక్ మ్యాచ్

## అండర్ 19 ప్రపంచకప్‌లో అసలైన పోరు.. ఆసక్తిగా యావత్తు క్రికెట్ ప్రపంచం

అండర్ 19 ప్రపంచకప్ 2026లో అసలు సిసలు పోరుకు రంగం సిద్ధమైంది. యావత్ క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న దాయాదుల పోరుకు సమయం ఆసన్నమైంది. ఆదివారం(ఫిబ్రవరి 1) జింబాబ్వేలోని బులవాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ మైదానం వేదికగా జరిగే తమ ఆఖరి సూపర్-సిక్స్ మ్యాచ్‌లో భారత్, పాకిస్థాన్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆయుష్ మాత్రే సారథ్యంలోని భారత యువ జట్టు వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి జోరు మీదుండగా.. పాకిస్థాన్ మూడింటిలో రెండు గెలిచింది. ఎమర్జింగ్ ఆసియా కప్ ఫైనల్లో పాక్ చేతిలో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలనే కసితో భారత కుర్రాళ్ల జట్టు ఉంది. ఆ మ్యాచ్‌లో టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీని.. పాక్ పేసర్లు కవ్వించగా.. అతను అదే రీతిలో బదులిచ్చాడు. అయితే ఈ సారి తన బ్యాట్‌తో వారికి సమాధానం చెప్పాలనుకుంటున్నాడు. ఈ మ్యాచ్‌లో భారత్ విజయం సాధిస్తే అధికారికంగా సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకుంటుంది. ఈ క్రమంలోనే ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఒంటి గంటకు మ్యాచ్ ప్రారంభం కానుండగా.. 12.30 గంటలకు టాస్ పడనుంది. ఈ మెగా టోర్నీకి స్టార్ స్పోర్ట్స్ నెట్ వర్క్, జియో హాట్‌స్టార్ అధికారిక బ్రాడ్‌కాస్టర్‌గా వ్యవహరిస్తున్నాయి.

**పిచ్ రిపోర్ట్ :**

బులవాయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. అయితే ఉదయం పేసర్లకు కొంత స్వింగ్ లభించే అవకాశం ఉంది. టాస్ గెలిచిన జట్టు ముందుగా బ్యాటింగ్ చేసి 280o పరుగులు చేస్తే ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచవచ్చు.

**భారత అండర్-19 జట్టు:**

ఆయుష్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, సి.ఆండ్రీ సిద్ధార్థ్, సాహిల్ పరాఖ్, నిఖిల్ కుమార్, అభిజ్ఞాన్ కుండు (కీపర్), హార్దిక్ రాజ్, కె.పి. కార్తికేయ, సమర్థ్ నగరాజ్, కిరణ్ చోర్మలే, నమన్ తివారీ, ప్రియాంషు మోలియా, మురుగన్ అభిషేక్, ధనుష్ గౌడ.

**పాకిస్థాన్ అండర్-19 జట్టు:**

సాద్ బేగ్ (కెప్టెన్/కీపర్), షాజైబ్ ఖాన్, అజాన్ అవైస్, షామ్ల హుస్సేన్, అరాఫత్ మిన్హాస్, అమీర్ హసన్, ఉబైద్ షా, మహ్మద్ జైషాన్, అలీ అస్ఫాండ్, నవీద్ అహ్మద్ ఖాన్, హారూన్ అర్షద్, అహ్మద్ హసన్, ఖుబైబ్ ఖలీల్, ముహమ్మద్ రియాజుల్లా.




### నాకు గౌరవం

## దక్కలేదు: యువీ

టీమిండియా మాజీ క్రికెటర్, వరల్డ్ కప్ విన్నర్ యువరాజ్ సింగ్ తన రిటైర్మెంట్‌కు సంబంధించి సంచలన విషయాలు వెల్లడించాడు. కెరీర్ చివరి దశలో తనకు కనీస గౌరవం దక్కలేదని తెలిపాడు. జట్టులో ఒక్కరు కూడా తనకు అండగా నిలవలేదని, దాంతోనే రిటైర్మెంట్ ప్రకటించానని వెల్లడించాడు. తాను కూడా ఆటను ఆస్వాదించలేకపోయానని, గౌరవంగా వీడ్కోలు పలకడమే ఉత్తమమని భావించానని చెప్పాడు. ఒక దశలో తనకు ఎంతో ఇష్టమైన క్రికెట్‌పై విరక్తి కలిగిందని చెప్పుకొచ్చాడు. సుదీర్ఘ కాలం భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన యువరాజ్ సింగ్.. ధోనీ సారథ్యంలో టీమిండియా గెలిచిన టీ20 ప్రపంచకప్ 2007, వన్డే ప్రపంచకప్ 2011 విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. వన్డే ప్రపంచకప్‌లో ఓవైపు క్యాన్సర్‌తో పోరాడుతూనే అద్భుత ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో యువీ రక్తపు వాంతులు చేసుకున్న ఘటన ఇప్పటికీ అభిమానుల కళ్లలో కదలాడుతూనే ఉంటుంది. క్యాన్సర్ జయించి రీఎంట్రీ ఇచ్చిన యువరాజ్ సింగ్ మునపటిలా సత్తా చాటలేకపోయాడు. పేలవ ఫామ్‌తో జట్టులో చోటు కోల్పోయి 2019 వన్డే ప్రపంచకప్ ముందు అన్ని ఫార్మాట్ల ఆటకు వీడ్కోలు పలికాడు. యువరాజ్ సింగ్ రిటైర్మెంట్ అయిన సమయంలో టీమిండియా కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ ఉన్నాడు. అయితే ఏనాడు కోహ్లీని యువరాజ్ సింగ్ నిందించలేదు. కానీ జట్టులో తనకు ఎవరి నుంచి సరైన మద్దతు లభించలేదని భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా తాజాగా నిర్వహించిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తెలిపాడు. లినా కెరీర్ చివరి దశలో నేను ఆటను ఆస్వాదించలేకపోయాను. ఆటను ఎంజాయ్ చేయనప్పుడు నేను క్రికెట్ ఎందుకు ఆడాలి? అనే భావన కలిగింది.




# రేపు 5వ టీ20

**అయ్యర్‌కు నిరాశే?.. ఇషాన్ రీ ఎంట్రీ!**

న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో హ్యాట్రిక్ విజయాలతో జోరు కనబర్చిన టీమిండియాకు ఊహించని పరాజయం ఎదురైంది. వైజాగ్ వేదికగా జరిగిన నాలుగో టీ20లో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 50 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. ఈ ఓటమితో టీమిండియా బలహీనతలు బయటపడ్డాయి. ఇరు జట్ల మధ్య ఆఖరి టీ20 తిరువనంతపురం వేదికగా శనివారం జరగనుంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ ముందు టీమిండియా ఆడుతున్న ఆఖరి మ్యాచ్ ఇదే కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సిరీస్‌లో దారుణంగా విఫలమైన సంజూ శాంసన్ తన హోమ్ టౌన్‌లో చెలరేగి ఫామ్ అందుకుంటాడా? లేక వైఫల్యాన్ని కొనసాగిస్తాడా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఆఖరి టీ20లోనూ శ్రేయస్ అయ్యర్‌కు నిరాశే ఎదురు కానుంది. టీ20 ప్రపంచకప్ జట్టులో భాగంగా ఉన్న ఆటగాళ్లందర్నీ ఆడించాలనే ఉద్దేశంతోనే ఇతర ఆటగాళ్లకు అవకాశం ఇవ్వడం లేదని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ఈ క్రమంలోనే అయ్యర్ మరోసారి బెంచ్‌కే పరిమితం కానున్నాడు. నాలుగో టీ20కి దూరమైన ఇషాన్ కిషన్ రీఎంట్రీ ఇవ్వనున్నాడు. వరుసగా రెండు మ్యాచ్‌లు ఆడిన జస్ప్రీత్ బుమ్రాకు వర్క్‌లోడ్‌మేనేజ్‌మెంట్‌లో భాగంగా విశ్రాంతి ఇవ్వవచ్చు. ఒకవేళ అతన్ని కొనసాగించాలనుకుంటే హర్షిత్ రాణాపై వేటు పడుతుంది. నాలుగో టీ20లో రాణా ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. మరోసారి ఎక్స్‌ట్రా బౌలర్‌తో ఆడాలనుకుంటే మాత్రం ముగ్గురు పేసర్లు బరిలోకి దిగుతారు. వరుసగా మూడు మ్యాచ్‌లు ఆడిన కుల్దీప్ యాదవ్‌కు ఆఖరి టీ20 నుంచి విశ్రాంతి కల్పించవచ్చు. అక్షర్ పటేల్ గాయంతో దూరమవడంతో జట్టులోకి వచ్చిన కుల్దీప్ యాదవ్ వరుసగా మూడు మ్యాచ్‌లు ఆడాడు. గత రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న వరుణ్ చక్రవర్తి.. కుల్దీప్ యాదవ్ స్థానంలో బరిలోకి దిగుతాడు. రవి బిష్ణోయ్‌ను తప్పించాలనుకుంటే కుల్దీప్ యాదవ్ జట్టులో కొనసాగుతాడు. ఆఖరి మ్యాచ్‌కు కూడా అక్షర్ పటేల్ దూరం కానున్నాడు. వరుసగా నాలుగు టీ20ల్లో విఫలమైన సంజూ శాంసన్‌కు తన హోమ్ గ్రౌండ్‌లో ఆఖరి అవకాశం ఇవ్వనున్నారు. ఈ మ్యాచ్‌లో రాణించకపోతే సంజూ శాంసన్ తుది జట్టులో చోటు కోల్పోవడం ఖాయం. మిగతా బ్యాటింగ్ కాంబినేషన్‌లో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు. సంజూకు జతగా అభిషేక్ శర్మ ఆడనుండగా.. ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే మిడిలార్డర్‌లో ఆడనున్నారు. హార్దిక్ పాండ్యా బ్యాట్ ఝులిపించాల్సిన అవసరం ఉంది.

### బౌలర్లను కచ్చితంగా

## అంచనా వేశా: దూబే

తన మైండ్‌సెట్‌తోనే తన ఆట మెరుగైందని టీమిండియా బ్యాటింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే తెలిపాడు. బౌలర్లు వేసే బంతులను కచ్చితంగా అంచనా వేస్తుండటంతోనే అలవోకగా భారీ షాట్లు ఆడగలుగుతున్నానని చెప్పాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా బుధవారం వైజాగ్ వేదికగా జరిగిన నాలుగో టీ20లో శివమ్ దూబే(23 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 65) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఇష్ సోధీ బౌలింగ్‌లో భారీ సిక్సర్లతో విరుచుకుపడిన శివమ్ దూబే.. ఒకే ఓవర్‌లో 29 పరుగులు రాబట్టి 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ మ్యాచ్‌లో 50 పరుగుల తేడాతో భారత్ ఓడినా.. శివమ్ దూబే ఊచకోత బ్యాటింగ్‌తో అభిమానులను అలరించాడు. ఇంకాసేపు దూబే క్రీజులో ఉంటే భారత్ గెలిచేదని అభిమానులు భావిస్తున్నారు. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శివమ్ దూబే.. కఠిన పరిస్థితుల్లో ఆడటం వల్ల బౌలర్ల వ్యూహాలను ముందుగానే పసిగట్టగలిగానని తెలిపాడు. 'ప్రస్తుతం నేను చాలా కష్టపడుతున్నాను. నా మానసిక స్థితితోనే నా ఆట మెరుగవుతోంది. కఠిన పరిస్థితుల్లో ఆడటం అలవాటవుతోంది. దాంతో బౌలర్ల వ్యూహాలను ముందుగానే పసిగట్టగలుగుతున్నాను. వారు నాకు ఎలాంటి బంతులు సంధించబోతున్నారో ఊహించగలుగుతున్నాను. స్పిన్ బౌలింగ్‌లో భారీ షాట్లు ఆడటం చాలా కష్టం. ఇష్ సోధీ చక్కగా బౌలింగ్ చేశాడు. అతను కొన్ని చెడ్డ బంతులేస్తాడని నాకు తెలుసు. వాటి కోసమే ఎదురు చూశాను. ఆ సమయంలో నేను డామినేట్ చేద్దామనుకున్నా'అని శివమ్ దూబే చెప్పుకొచ్చాడు. 63 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే.. ఎదుర్కొన్న తొలి బంతినే భారీ సిక్సర్‌తో స్టేడియం బయటకు పంపించాడు. అతని ధాటికి బంతి 101 మీటర్ల దూరంలో పడింది. ఈ సిక్స్‌కు న్యూజిలాండ్ బౌలర్ కమ్ కెప్టెన్ అయిన మిచెల్ సాంట్నెర్ నోరెళ్ల బెట్టాడు. ఇష్ సోధీ వేసిన 12వ ఓవర్‌లో వరుసగా 2, 4, 6,4, 6, 6 బాది 29 పరుగులు పిండుకున్నాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో సెంచరీ చేసేలా కనిపించిన శివమ్ దూబే(23 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 65) దురదృష్టకర రీతిలో రనౌటయ్యాడు. మ్యాట్ హెన్రీ బౌలింగ్‌లో హర్షిత్ రాణా కొట్టిన షాట్‌కు బంతి బౌలర్ చేతికి తాకి నాన్‌స్ట్రైకర్ వికెట్లను తాకింది. అప్పటికే శివమ్ దూబే క్రీజును ధాటడంతో రనౌట్‌గా వెనుదిరిగాల్సి వచ్చింది.







## డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ఆర్సీబీ

**చితక్కొట్టిన హ్యారిస్, మంధాన.. యూపీ వారియర్స్‌పై పంజా**

**మరో టైటిల్‌కు అడుగు దూరంలో**

డబ్ల్యూపీఎల్ మూడో సీజన్ విజేత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. నాలుగో సీజన్‌లో వరుసగా ఐదు విజయాలతో ప్లే ఆఫ్స్ చేరిన ఆర్సీబీ.. లీగ్ దశ చివరి పోరులోనూ చెలరేగింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొడుతూ యూపీ వారియర్స్‌ను 8 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. 149 పరగుల మోస్తురు ఛేదనలో గ్రేస్ హ్యారిస్(75), స్మృతి మంధాన(54 నాటౌట్)ల విధ్వంసంతో యూపీ బౌలర్లు నీరుగారిపోయారు. హ్యారిస్ ఔటయ్యాక మరింత జోరు పెంచిన మంధాన.. శోభన ఓవర్లో భారీ సిక్సర్ బాదిన మంధాన.. సింగిల్ తీసి 26 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకుంది. విజయానికి 9 పరుగుల దూరంలో జార్జియా వోల్(16) బంతిని అంచనా వేయలేక సులువైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత వచ్చిన రీచా ఘోష్(0 నాటౌట్)తో కలిసి లాంఛనం పూర్తి చేసింది కెప్టెన్. 13.1 ఓవర్లోనే ఛేదించి యూపీకి దిమ్మతిరిగే షాకిచ్చిన బెంగళురు 12 పాయింట్లతో ఫైనల్ బెర్తు పట్టేసింది. ప్లే ఆఫ్స్ చేరాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌కు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. పవర్ ప్లేలోనే వికెట్లు తీసి ఒత్తిడి పెంచే లారెన్ బెల్‌ను దీటుగా ఎదుర్కొన్న మేగ్ లానింగ్(41), దీప్తి శర్మ(55)లు ధనాధన్ ఆడారు. తొలి వికెట్‌కు 74 రన్స్ జోడించి భారీ స్కోర్‌కు బాటలు వేసిన ఈ ద్వయాన్ని నడినే డీ క్లెర్క్ (4-22) విడదీసిది. డేంజరస్ లానింగ్‌ను పెవిలియన్ పంపిన తను.. అమీ జోన్స్(1)ను ఔట్ చేసి మరో బ్రేకిచ్చింది. ఆ తర్వాత వచ్చినవాళ్లేవరూ క్రీజులో నిలువలేదు. అర్ధ శతకంతో యూపీ స్కోర్ 130 దాటించిన దీప్తిని శ్రేయాంక పాటిల్ వెనక్కి పంపింది. ఆ తర్వాత పరుగుల చేసేవారు కరువవ్వడంతో యూపీ నిర్ణీత ఓవర్లలో 148కే పరిమితమైంది.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శుక్రవారం 30-1-2026

# డిజిటల్.. డ్యామేజీ!



భారతదేశం నేడు డిజిటల్ విప్లవంలో దూసుకుపోతోంది. దాదాపు 97 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు మరియు 85% పైగా గృహాల్లో స్మార్ట్‌ఫోన్ల లభ్యతతో మనం ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా అవతరించాం. అయితే, ఈ వేగవంతమైన వృద్ధి వెనుక "డిజిటల్ వ్యసనం" అనే ఒక నిశ్శబ్ద మహమ్మారి మన యువతను చుట్టుముడుతోంది. ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వే 2025-26 ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, డిజిటల్ వ్యసనం మన దేశ భవిష్యత్తుపై చూపే ప్రభావాలను విశ్లేషించింది.

డిజిటల్ వ్యసనం అంటే కేవలం ఫోన్ చూడటం మాత్రమే కాదు; అది స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్, గేమింగ్ మరియు సోషల్ మీడియాపై అతిగా ఆధారపడటం వల్ల కలిగే మానసిక స్థితి. 15-24 ఏళ్ల మధ్య వయస్సు గల భారత యువతలో సోషల్ మీడియా వ్యసనం ప్రమాదకర స్థాయిలో ఉందని గణాంకాలు చెబుతున్నాయి. భారతదేశంలో సుమారు 35 కోట్ల మంది సోషల్ మీడియా వినియోగదారులు ఉండగా, అందులో అధిక శాతం యువత మరియు కౌమార దశలోని వారే ఉన్నారు. కేవలం 2024 సంవత్సరంలోనే భారతీయులు స్మార్ట్‌ఫోన్ల మీద గడిపిన సమయం 1.1 లక్షల కోట్ల గంటలు అని అంచనా. అతిగా స్క్రీన్ చూడటం వల్ల యువతలో ఆందోళన, కుంగుబాటు, ఆత్మన్యూనతా భావం పెరుగుతున్నాయి. ఇతరుల ఆకర్షణీయమైన పోస్టులను చూసి తమ జీవితాలను వారితో పోల్చుకోవడం వల్ల మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. డిజిటల్ మాధ్యమాల్లో వేధింపుల కారణంగా యువత ఆత్మహత్యల వరకు వెళ్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. రాత్రంతా మొబైల్ వాడటం వల్ల 'స్లీప్ డెట్' ఏర్పడి, అది చిరాకు, ఏకాగ్రత లోపానికి దారితీస్తోంది. ఈ వ్యసనం కేవలం ఆరోగ్యానికే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ముప్పుగా మారుతోంది. చదువుకోవాల్సిన వయస్సులో యువత రీల్స్, షార్ట్ వీడియోల కోసం గంటల కొద్దీ సమయాన్ని వృధా చేస్తున్నారు. దీనివల్ల నైపుణ్యాల కొరత ఏర్పడి, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు తగ్గడమే కాకుండా దేశ ఉత్పాదకత కూడా దెబ్బతింటుంది. ముఖ్యంగా గేమింగ్ మరియు ఆన్‌లైన్ జూదం యువతను ఆర్థికంగా దివాళా తీయించడమే కాకుండా తీవ్రమైన ఆందోళనలకు గురిచేస్తున్నాయి. మానసిక ఆరోగ్య సమస్యల కోసం 24/7 అందుబాటులో ఉండే టెలిమానస్ హెల్ప్‌లైన్ (14416) ద్వారా లక్షలాది మందికి కౌన్సెలింగ్ అందుతోంది. టెక్నాలజీ అనేది ఒక సాధనం మాత్రమే, అది మన జీవితాలను శాసించకూడదు. పాఠశాలల్లో "డిజిటల్ వెల్నెస్ కరికులం" ప్రవేశపెట్టడం, తల్లిదండ్రులు పిల్లల స్క్రీన్ సమయాన్ని పర్యవేక్షించడం మరియు యువతలో "డిజిటల్ డైట్" అలవాటును ప్రోత్సహించడం నేటి అవసరం. భవిష్యత్ తరాలను ఈ డిజిటల్ మాయాజాలం నుంచి రక్షించుకుంటేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.

– ఈవార్తలు సంపాదకీయ విభాగం

# శాంతి సందేశమే.. భారత నినాదం

**(..నేడు అమరవీరుల దినోత్సవం..)**

దేశ స్వాతంత్ర్యం కోసం, దేశ సమగ్రతను కాపాడటం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన అమరవీరుల స్మృత్యర్థం నేడు (జనవరి 30) దేశవ్యాప్తంగా 'అమరుల దినోత్సవం' నిర్వహిస్తున్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈ రోజున దేశం గర్వంగా నివాళులర్పిస్తుంది. 1948 జనవరి 30వ తేదీన మహాత్మా గాంధీ నాథూరామ్ గాడ్సే చేతిలో హత్యకు గురయ్యారు. శాంతి, అహింసల ద్వారా దేశానికి స్వేచ్ఛను ప్రసాదించిన బాపూజీకి నివాళిగా భారత ప్రభుత్వం ఈ రోజును 'అమరుల దినోత్సవం' (సర్వోదయ దినం)గా ప్రకటించింది.



కేవలం గాంధీజీనే కాకుండా, సరిహద్దుల్లో దేశాన్ని రక్షించే క్రమంలో వీరమరణం పొందిన సైనికులందరినీ ఈ రోజున స్మరించుకోవడం ఆనవాయితీ. ప్రతి ఏటా ఈ రోజున రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, రక్షణ శాఖ మంత్రులు ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద ఉన్న గాంధీ సమాధిని సందర్శించి పుష్పాంజలి ఘటిస్తారు. ఉదయం 11:00 గంటలకు దేశవ్యాప్తంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరవీరులకు గౌరవం ప్రకటిస్తారు. పాఠశాలలు, కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. భారత త్రివిధ దళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్) అమరవీరుల గౌరవార్థం ప్రత్యేక కవాతు, గౌరవ వందనం సమర్పిస్తాయి. చాలా మంది జనవరి 30, మార్చి 23 తేదీల మధ్య గందరగోళానికి గురవుతుంటారు. జనవరి 30న మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జరుపుకునేది. మార్చి 23న భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను బ్రిటిష్ వారు ఉరితీసిన రోజును పురస్కరించుకుని వారి త్యాగానికి చిహ్నంగా దీనిని జరుపుకుంటారు. భారత్‌లో అధికారికంగా ఐదు కంటే ఎక్కువ రోజులను వేర్వేరు సందర్భాల్లో అమరుల దినోత్సవాలుగా పాటిస్తారు, కానీ జాతీయ స్థాయిలో జనవరి 30 అత్యంత ప్రధానమైనది. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం అంటే కేవలం నివాళులర్పించడం మాత్రమే కాదు, వారు కలలుగన్న అభివృద్ధి చెందిన, శాంతియుతమైన భారతదేశాన్ని నిర్మించడమే వారికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

ఒక దేశం లేదా ఒక రాష్ట్ర ప్రస్థానంలో కొన్ని ప్రాజెక్టులు కేవలం సిమెంట్, స్టీల్ కట్టడాలుగా మిగిలిపోవు. అవి ఆ ప్రాంత భవిష్యత్తును, ప్రజల జీవన ప్రమాణాలను సమూలంగా మార్చే "గేమ్ ఛేంజర్లు"గా నిలుస్తాయి. తెలంగాణ విషయానికొస్తే, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అటువంటి ఒక అద్భుతం. దశాబ్దాల నీటి గోసను తీర్చి, బీడు భూములను పచ్చని పైర్లతో నింపిన ఈ ప్రాజెక్టు తెలంగాణకు నిజమైన "జీవనాడి".

# గేమ్ ఛేంజర్.. కాళేశ్వరం



తెలంగాణ పీఠభూమి ప్రాంతం కావడం వల్ల గోదావరి నది రాష్ట్రం గుండా ప్రవహిస్తున్నప్పటికీ, నీరు పల్లపు ప్రాంతాలకే పరిమితమయ్యేది. ఎగువన ఉన్న పొలాలకు నీరు అందక రైతాంగం వర్షాలపై లేదా బోరు బావులపై ఆధారపడాల్సి వచ్చేది. ఈ భౌగోళిక సవాలును అధిగమించడానికి, సముద్ర మట్టానికి సుమారు 100 మీటర్ల ఎత్తులో ఉన్న గోదావరి నీటిని, 600 మీటర్ల ఎత్తుకు తరలించడమే కాళేశ్వరం ప్రధాన ఉద్దేశ్యం. కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం భారతదేశంలోనే కాదు, ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ-స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా రికార్డు సృష్టించింది. గోదావరి, ప్రాణహిత నదుల సంగమ క్షేత్రమైన కాళేశ్వరం వద్ద మేడిగడ్డ బ్యారేజీ ద్వారా నీటిని తరలించడం దీని ప్రత్యేకత. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన (139 మెగావాట్ల) పంపులను ఇక్కడ వినియోగించారు. సుమారు 141 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో భారీ రిజర్వాయర్లు (కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ వంటివి) నిర్మించబడ్డాయి.

### 3. వ్యవసాయ రంగంలో విప్లవం

తెలంగాణను "భారతదేశ ధాన్యాగారం" గా మార్చడంలో కాళేశ్వరం పాత్ర అద్వితీయం. దాదాపు 45 లక్షల ఎకరాల కొత్త మరియు పాత ఆయకట్టుకు స్థిరీకరణ జరిగింది. గతంలో ఏడాదికి ఒకే పంట పండించే చోట, నేడు రెండు లేదా మూడు పంటలు పండుతున్నాయి. వరి సాగులో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడానికి ఈ ప్రాజెక్టు అందించిన భరోసానే కారణం. ప్రాజెక్టు పరిధిలోని చెరువులు నింపడం వల్ల భూగర్భ జల మట్టం గణనీయంగా పెరిగింది. జీవనాడి అంటే కేవలం వ్యవసాయమే కాదు, ప్రజల దాహార్తిని తీర్చడం కూడా. హైదరాబాద్ వంటి మహానగరాలతో పాటు రాష్ట్రంలోని వేలాది గ్రామాలకు తాగునీటిని అందించడానికి కాళేశ్వరం నీరే ఆధారం. పారిశ్రామిక అవసరాలకు 10 టీఎంసీల నీటిని కేటాయించడం ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు పెరగడానికి, ఉపాధి అవకాశాలు మెరుగుపడటానికి దోహదపడింది. నీరు పుష్కలంగా అందుబాటులోకి రావడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైంది. రైతు ఆత్మహత్యలు తగ్గి, వ్యవసాయంపై నమ్మకం పెరిగింది. వలసలు వెళ్ళిన కూలీలు తిరిగి గ్రామాలకు వచ్చి వ్యవసాయం చేసుకోవడం ఒక సామాజిక విజయం. రిజర్వాయర్ల వద్ద పర్యాటక రంగం అభివృద్ధి చెందడం వల్ల స్థానికులకు ఉపాధి దొరుకుతోంది. ఇంత భారీ ప్రాజెక్టులో నిర్వహణ సవాళ్లు ఎదురవ్వడం సహజం. మేడిగడ్డ వంటి బ్యారేజీల వద్ద సాంకేతిక లోపాలను సరిదిద్దడం, విద్యుత్ ఖర్చును తగ్గించుకోవడంపై దృష్టి పెట్టాలి. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడానికి పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలి.

– రఘువరన్, పెద్దపల్లి

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.